ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
ప్రకాశం
జిల్లా వార్తలు
సోమవారం 3, నవంబరు 2025

ఓం నమో శివరుద్రాయ..

కార్తీక మాసం సందర్భంగా గిద్దలూరులో 8 అడుగుల మట్టి శివలింగాన్ని ఏర్పాటు చేసి ఆదివారం మహారుద్రాభిషేకం, మహాభస్మాభిషేకం చేశారు. హిమాలయాల నుంచి వచ్చిన సాధువులు ఈ క్రతువును నిర్వహించారు. 10వేల మందికిపైగా భక్తులు హాజరై తిలకించి తరించారు. ఈ సందర్భంగా కోటి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

వివరాలు 7వ పేజీలో..





తెప్పోత్సవం.. తన్మయత్వం..

క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా మార్కాపురంలో శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి వారి తెప్పోత్సవాన్ని ఆదివారం కన్నులపండువలా నిర్వహించారు. స్వామివారు ఆలయం నుంచి ఉభయదేవేరులతో బాణసంచా మోతలు, మంగళ వాయిద్యాలు, భాజాభజంత్రీల మధ్య పుష్కరిణి వద్దకు చేరుకున్నారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతుడైన చెన్నయ్య.. రంగనాయకస్వామి అలంకారంలో పుష్కరిణిలో జలవిహారం చేస్తూ దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు తిలకించి తన్మయత్వం చెందారు. ఆప్రాంతమంతా జై చెన్నయ్య.. జైజై చెన్నయ్య నామస్మరణతో మార్మోగింది.

వివరాలు 7వ పేజీలో..





జలకళ!

నదులు, వాగుల్లో కొనసాగుతున్న ప్రవాహ ఉధృతి

- నిండుకుండల్లా రిజర్వాయర్లు, చిన్న, మధ్య తరహా చెరువులు
- మొంథాతో కొన్ని నష్టాలున్నా కళకళలాడుతున్న నీటి వనరులు
- ఈ సీజన్ సాగు, తాగునీటి అవసరాలకు ఢోకా లేదంటున్న ప్రజానీకం
- భారీగా పెరిగిన భూగర్భ జలం

జిల్లాలో ఎటుచూసినా నీటి పరవళ్లు కనిపిస్తున్నాయి. తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలు ఆగి నాలుగురోజులైనప్పటికీ నదులు, వాగులు, వంకలు, కాలువలు ఇంకా ఉధృతంగానే ప్రవహిస్తున్నాయి. రిజర్వాయర్లు, చిన్న, మధ్య తరహా చెరువులు, కుంటలు అన్నీ నిండుకుండల్లా కనిపిస్తున్నాయి. మొంథా తుఫాన్ కొన్ని రంగాలపై తీవ్రప్రతికూలత చూపినప్పటికీ నీటి వనరుల్లో మాత్రం జలకళ కనిపిస్తోంది. ఈ సీజన్ సాగు, తాగునీటి అవసరాలకు ఏమాత్రం ఢోకా లేదన్న అభిప్రాయం రైతుల నుంచి వ్యక్తమవుతోంది. ఆ వనరుల కింద పంటల సాగుకు వారు సిద్ధమవుతున్నారు.

ఒంగోలు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సాధారణంగా సెప్టెంబరు నుంచి నవంబరు వరకు మంచి వర్షాలు కురుస్తాయి. వార్షిక వర్షపాతం 679.80 మి.మీ కాగా అందులో ఈ మూడు నెలల్లోనే దాదాపు 400 మి.మీ నమోదవుతుంది. ప్రత్యేకించి అక్టోబరులో ఏకంగా వార్షిక వర్షపాతంలో 30శాతం అంటే 207.50 మి.మీ కురుస్తుంది. అలా ఈ సమయంలో విస్తారంగా వర్షాలు పడుతూ నీటి వనరులు కళకళలాడటం సహజం. అయితే ప్రస్తుతం ఉన్నంత పుష్కలంగా నీటి వనరులు గత కొన్నేళ్లుగా ఎన్నడూ లేవు. 'మొంథా' వల్ల కురిసిన వర్షాలే అందుకు కారణం. ఈ తుఫాన్ కారణంగా కేవలం 36 గంటల వ్యవధిలో జిల్లాలో సగటున 18.40 సెం.మీ వర్షపాతం నమోదైంది. పశ్చిమప్రాంతంలో 10నుంచి 20 సెం.మీ కురిసింది. తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో 15నుంచి 25 సెం.మీ పడింది. సాధారణంగా ఈ సమయంలో పశ్చిమప్రాంతంలో చాలా తక్కువగా తూర్పు, దక్షిణప్రాంతంలో అధికంగా వర్షాలు ఉంటాయి. అలాంటిది ఈసారి తూర్పుతోపాటు పశ్చిమప్రాంతంలో అతిభారీ వర్షాలు పడ్డాయి. దీంతో నాలుగైదు రోజులపాటు జిల్లాలో ఎటుచూసినా పెద్దఎత్తున నీటి ప్రవాహాలు సాగాయి. అనేక చోట్ల రోజుల తరబడి రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రస్తుతం వర్షాలు ఆగి నాలుగు రోజులు దాటినా జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ నీటి ప్రవాహాలు కనిపిస్తున్నాయి.



నిండు కుండలా ఉన్న కంభం చెరువు

నీటితో తొణికిసలాడుతున్న చెరువులు

జిల్లాలో ఉన్న 698 చెరువులు పూర్తిగా నిండి అలుగులు పారాయి. మిగిలిన వాటిలోనూ 90శాతానికి పైగా నీరు చేరి నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. గిద్దలూరు నియోజకవర్గంలో కంభం చెరువుతోపాటు రామన్న కత్తువ, గుండ్లమోటు ప్రాజెక్టు, సగిలేరు సప్లయ్ చానల్ పరిధిలోని అన్ని వనరులూ నిండాయి. కనిగిరి నియోజకవర్గంలో పెద్దవిగా ఉండే గొల్లపల్లి రిజర్వాయర్, పునుగోడు చెరువు, హాజీపురం, పందువగండి, నరసమందాపురం, సీఎస్‌పురం చెరువు తదితరాల్లో పుష్కలంగా నీరు చేరింది. మార్కాపురం, తర్లుబాడు, పొదిలి మండలాల్లోని పలు చెరువులు నిండాయి. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని చెరువులూ నీటితో తొణికిసలాడుతున్నాయి. దర్శి నియోజకవర్గంలో సాగర్ కాలువలకు ఈ ఏడాది నీటి సరఫరా పుష్కలంగా ఉండటంతో తొలి నుంచి జలకళ కనిపిస్తుండగా ప్రస్తుతం ఎటు చూసినా నీటి ప్రవాహాలు కొనసాగుతున్నాయి. తూర్పు, దక్షిణ ప్రాంతంలోని సంతనూతలపాడు, ఒంగోలు, కొండపి నియోజకవర్గాల్లోని అన్ని చెరువులు నిండుకుండల్లా ఉన్నాయి. వాగులు, వంకలు ఇంకా ఉధృంగానే ప్రవహిస్తున్నాయి. ఇక జిల్లా అంతటా వాటర్ షెడ్‌లు, పొలాల్లో ఉండే నీటి కుంటలు నిండాయి. దీంతో భూగర్భజలం గణనీయంగా పెరిగింది. పశ్చిమప్రాంతంలోని పలుచోట్ల ఈవారంలో కురిసిన వర్షాలతో బోర్లలో నీరు దానంతట అదే పొంగి బయటకు రావడం భూగర్భ జలం పెరిగిన దానికి నిదర్శనం.



రిజర్వాయర్‌లు ఫుల్

జిల్లాలోని గుండ్లకమ్మ, పాలేరు, ముసి, సగిలేరు వంటి నదులు.. దోర్నపు వాగు, చిలకలేరు వంటి చిన్న, పెద్ద దాదాపు 50కిపైగా వాగుల్లో నేటికీ ఉధృతంగానే ప్రవాహాలు సాగుతున్నాయి. గుండ్లకమ్మ, రామతీర్థం రిజర్వాయర్లు, కంభం చెరువు, ఇతర చిన్న మధ్య తరహా చెరువులు నిండు కుండల్లా దర్శనమిస్తున్నాయి. సుమారు 3.859 టీఎంసీల సామర్థ్యం ఉన్న గుండ్లకమ్మ ప్రాజెక్టులో ప్రస్తుతం 3.30 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి 11,960 క్యూసెక్కులకు పైగా వరద వస్తోంది. దీంతో ఆ మొత్తాన్ని ఐదు గేట్లు ఎత్తి దిగువకు వదులుతున్నారు. గుండ్లకమ్మ ఎగువనే కాక దిగువ ప్రాంతంలో కూడా నీరు పరవళ్లు తొక్కుతోంది. రామతీర్థం రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 1.569 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.54 టీఎంసీల మేర నిల్వ ఉంది. చారిత్రక కంభం చెరువు ఐదేళ్ల తర్వాత పూర్తిస్థాయిలో నిండి అలుగు పారుతోంది. సుమారు 2.95 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఈచెరువు పూర్తిగా నిండింది. ఎగువ నుంచి 1,600 క్యూసెక్కుల వరద వస్తుండటంతో 2,500 క్యూసెక్కుల నీరు దిగువకు వదులుతున్నారు. మోపాడు రిజర్వాయర్ నీటి మట్టం 29 అడుగులు కాగా ప్రస్తుతం 17 అడుగులు ఉంది. తుఫాన్ ముందు అందులో 9 అడుగుల నీరు ఉండగా ప్రస్తుతం అది 17 అడుగులకు చేరింది. దీంతో ఆయకట్టుకు నీటి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

86.48 శాతం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- ఒంగోలులోనే ఇబ్బందులు ● ఒకచోట అడ్రసు.. మరోచోట నివాసం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ వేగవంతంగా సాగుతోంది. ఇప్పటికే 86.48 శాతం మంది కార్డుదారులకు వాటిని అందజేశారు. గత నెల 20వతేదీ నుంచి ప్రక్రియను ప్రారంభించారు. జిల్లాలో 6,51,820 తెల్లరేషన్ కార్డులు ఉండగా ఇప్పటి వరకూ దాదాపు 5,63,723 మందికిపైగా పంపిణీ చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రక్షాళనకు ఉపక్రమించింది. సరుకులను పారదర్శకంగా అందజేయడంతోపాటు, అక్రమాలను అరికట్టేందుకు పలు చర్యలు తీసుకొంది. అందులో భాగంగా ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులను ప్రవేశపెట్టింది. 12 రోజుల నుంచి జిల్లావ్యాప్తంగా స్మార్ట్ కార్డుల పంపిణీ జరుగుతోంది.

ఒంగోలు నియోజకవర్గంలో మందకొడిగా..



జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 38 మండలాలు ఉన్నాయి. మిగిలిన అన్ని చోట్లా ఇప్పటికే 90శాతం కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఒంగోలు నియోజకవర్గంలో ముఖ్యంగా అర్బన్ ప్రాంతంలో కార్డుల పంపిణీ ఇబ్బందికరంగా మారింది. నియోజకవర్గంలో 64,148 కార్డులు ఉండగా ఇప్పటి వరకూ సుమారు 47,615 (74.23 శాతం) పంపిణీ చేశారు. కొందరు ఒకచోట అడ్రస్‌తో కార్డు పొంది ఇప్పుడు మరోచోట నివాసం ఉండటం వల్ల ఈ సమస్య ఏర్పడింది. ప్రస్తుతం నవంబరు నెల రేషన్ పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. దాన్ని తీసుకునేందుకు వస్తున్న వారికి డీలర్లు స్మార్ట్ కార్డులను ఇస్తున్నారు. మిగిలిన వారిని గుర్తించలేకపోవడంతో ఒంగోలు నియోజకవర్గంలో పంపిణీ ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. వారం పది రోజుల్లో 100శాతం స్మార్ట్‌కార్డులను పంపిణీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

భార్య కుటుంబ సభ్యుల దాడి.. కాసేపటికే భర్త మృతి

- టంగుటూరులో ఘటన ● మృతుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

7

సోషల్ మీడియాపై పోలీసు నిఘా

- వాట్సప్ గ్రూపుల అడ్మిన్‌లకు నోటీసులు ● జిల్లాలో నేరచరిత్ర కలిగిన 23 మంది గుర్తింపు

ఒంగోలు క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాపై పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. వర్గవైషమ్యాలను రెచ్చగొట్టే పోస్టింగ్‌లను నిత్యం పరిశీలిస్తున్నారు. కర్నూలు బస్సు ప్రమాదంపై కొంత మంది సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఉండటంతో 27 మందిపై కేసులు నమోదు చేశారు. తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం, వైషమ్యాలు సృష్టించడం, వ్యక్తిగత దూషణలకు దిగడం వంటి పోస్టింగ్‌లు సోషల్‌మీడియాలో అదే పనిగా ప్రచారం చేస్తున్న వారిపై నిఘా పెట్టారు. సోషల్ మీడియా గ్రూపులలో ఎలాంటి పోస్టులు పెట్టినా గ్రూపు అడ్మిన్‌లదే బాధ్యత అని, అందుకు సంబంధించిన పోస్టులను వారు పరిశీలించి తొలగించడమే కాకుండా సామాజిక బాధ్యతగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రధానంగా నేరచరిత్ర కలిగిన వారిలో గ్రూపు అడ్మిన్‌లుగా 23 మంది ఉన్నట్లు గుర్తించారు. వారికి నోటీసులు జారీ చేశారు.

నోటీసులలో కోరిన వివరాలు

ఇప్పటికే వాట్సప్ గ్రూపు అడ్మిన్‌లకు ఇచ్చిన నోటీసులలో పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి. వాట్సప్ గ్రూపు పేరు, ఎందుకు ఏర్పాటు చేసుకున్నారు? అడ్మిన్ పేరు, చిరునామా, సభ్యులు ఎంతమంది ఉన్నారు? సమాజానికి నష్టం కలిగించే పోస్టింగ్‌లు ఏమైనా పెడుతున్నారా? అనే వివరాలు కోరుతూ నోటీసులు జారీ చేశారు.



గ్రూపు సభ్యులు పాటించాల్సిన విధివిధానాలు

- గ్రూపు ఏర్పాటు చేసిన అడ్మిన్ ఆ గ్రూపునకు పూర్తి బాధ్యత వహించాలి.
- చట్టవిరుద్ధమైన, కులమత ఘర్షణలకు అవకాశం కల్పించే పోస్టింగ్‌లు ఉండకూడదు.
- ఒకవేళ ఎవరైనా వర్గవైషమ్యాలు రెచ్చగొట్టే విధంగా పోస్టింగ్‌లు పెడితే వాటిని తొలగించాల్సిన బాధ్యత అడ్మిన్ తీసుకోవాలి. అనంతరం ఆ సభ్యుడి వివరాలు, పోస్టు వివరాలు సమీప పోలీసుస్టేషన్‌లో తెలియజేయాలి.

చట్టవిరుద్ధంగా పోస్టింగ్‌లు పెడితే చర్యలు

సోషల్ మీడియాలో చట్ట విరుద్ధంగా పోస్టింగ్‌లు పెడితే బీఎన్ఎస్ఎస్ 168 ప్రకారం చర్యలు తీసుకుంటాం. వాట్సప్ గ్రూపులలో వచ్చే పోస్టింగ్‌లకు అడ్మిన్‌లు బాధ్యత వహించాలి. శాంతభద్రతలకు విఘాతం కలిగించే పోస్టింగ్‌లు పెట్టేవారిపై చర్యలు తప్పవు.

- వి.హర్షవర్ధన్‌రాజు, ఎస్పీ

ఊరికి ఉపకారం!

- వర్షాలకు దెబ్బతిన్న కారుమంచి-మల్లవరప్పాడు రోడ్డు
- వాహనదారుల ఇబ్బందులు
- సొంత నిధులతో టీడీపీ నేత మరమ్మతులు... నాయకుల పర్యవేక్షణ

టంగుటూరు (కొండపి), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు ఇనగలేరులో నీటి ప్రవాహం పెరిగి వరద ఉధృతికి కారుమంచి-మల్లవరప్పాడు గ్రామాల మధ్యలో రోడ్డు దెబ్బతింది. దీంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో కారుమంచి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఈదర ప్రభాకర్ స్పందించారు. సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులను ఆదివారం ప్రారంభించారు. జేసీబీతో గుంతలను పూడ్చివేయించారు. అనంతరం ఎర్రమట్టి గ్రావెల్‌ను తోలి రోలర్‌తో తొక్కించారు. రోడ్డు విస్తరణ, మరమ్మతు పనులను కారుమంచి సర్పంచ్ మన్నం శ్రీనివాస్, గ్రామ బీసీ నాయకుడు ఆత్మకూరి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పర్యవేక్షించారు.



దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న టీడీపీ నేతలు

ప్రభుత్వ ఖాజీగా మౌలానాఆరీఫ్


జీవో కాపీని అందజేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు డివిజన్ పరిధిలోని ముస్లిం సామాజిక వర్గానికి నిఖా (వివాహాలు) జరిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నగరానికి చెందిన మౌలానా షేక్ ఆరీఫ్‌ను నియమించింది. ఈ మేరకు ఆదివారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆరీఫ్ తన నియామకానికి కృషి చేసినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒంగోలు నగరంతోపాటు, రెవిన్యూ డివిజన్ పరిధిలో 10 సంవత్సరాలుపాటు ముస్లిం వివాహాలు జరిపించే అవకాశం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ నాయకులు షేక్ కపిల్‌బాషా, పఠాన్‌హనీఫ్‌ఖాన్, నాయకులు పఠాన్‌నాయబ్, షేక్ మస్తాన్‌వలి, అల్లాభక్షు తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు చేయూత


సరుకులను అందజేస్తున్న నిర్వాహకులు

ఒంగోలు కల్చరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని వందమంది నిరాశ్రయులకు హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఫౌండేషన్ నిర్వాహకులు కొమ్మి రమణయ్య, రాజేశ్వరి ఆధ్వర్యంలో వాసవి అపార్ట్‌మెంట్‌లో జరిగిన కార్యక్రమంలో నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ ప్రీతమ్ వర్షితల పుట్టిన రోజును పురస్కరించుకుని సరుకులను అందజేస్తున్నట్లు తెలిపారు. శివాలయంలో అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో నూకతోటి శరత్‌బాబు, మారెళ్ల రాజేశ్వరి, వంకాయలపాటి సత్యవతి, అనంతలక్ష్మి, సునీత, ఉష తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి దూరంగా ఉండాలి


ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది, విద్యార్థులు

ఒంగోలు కల్చరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ అవినీతికి దూరంగా ఉండాలని, అప్పుడే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ కాళహస్తి సంపూర్ణ అన్నారు. ఆదివారం ఒంగోలులోని జిల్లా గ్రంథాలయంలో విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా ఆమె సిబ్బంది, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా చదవటం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా క్విజ్, డ్రాయింగ్, ఇండోర్ గేమ్స్ నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు కార్యక్రమంలో డీసీఎల్ సిబ్బంది టి.గోవిందమ్మ, ఫ్యాకల్టీ, బుక్ రీడింగ్ క్లబ్, లైబ్రరీ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాలవిహార్‌లో శిక్షణ తరగతులు


కథను చెబుతున్న విద్యార్థిని

ఒంగోలు కల్చరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి):శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం, చిన్మయ మిషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న బాలవిహార్ శిక్షణా తరగతులు విద్యార్థుల మేధస్సును పెంపొందించటానికి ఎంతగానో ఉపయోగపడతాయని చిన్మయ మిషన్ స్వామీజీ పవిత్ర చైతన్య అన్నారు. ఆదివారం శ్రీగిరి గోక్షేత్ర భవనంలో నిర్వహించిన శిక్షణా తరగతులలో విద్యార్థులకు కథలు చెప్పటం, అంత్యాక్షరి పోటీలు, భగవద్గీత శ్లోకాల పఠనం మొదలైన పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పవిత్ర చైతన్య మాట్లాడుతూ విద్యార్థులలో నిబిడీకృతమై ఉన్న శక్తి సామర్థ్యాలను వెలికి తీసే విధంగా కృషిచేస్తున్న శ్రీగిరి దేవస్థాన నిర్వాహకులు, చిన్మయమిషన్ స్థానిక ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ధర్మకర్తల మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు సరుకుల పంపిణీ


సరుకులను అందజేస్తున్న నాయకులు

టంగుటూరు (కొండపి), నవంబరు2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన బాధితులకు నిత్యవసర సరుకులు, నగదు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రామా గోపీ ఆదివారం కొణిజేడు గ్రామంలో అందజేశారు. గ్రామంలోని బీసీ, ఎస్టీ, మైనార్టీల కుటుంబాలకు 25 కేజీల బియ్యం, ఒకకేజీ కందిపప్పు, కేజీ చక్కెర, కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళా దుంపలు, లీటరు నూనె అందజేశారు. కుటుంబంలో సభ్యుల ఆధారంగా ఒకరికి వెయ్యి రూపాయలు, ఇద్దరికి రెండు వేల రూపాయలు, ముగ్గురి కంటే ఎక్కువ మంది ఉన్న కుటుంబాలకు రూ.3వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వో టి.కుముద్‌బెన్‌జోషి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు పొనుగుమాటి కల్యాణ్, నాయకులు యు.యానాది, సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు రామా సీతారామయ్య పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలి

● సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బందగీసాహెబ్


మాట్లాడుతున్న బందగీసాహెబ్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ) సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బందగీసాహెబ్ డిమాండ్ చేశారు. ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడ కేంద్రంగా జరిగిన పోరాటాల ఫలితంగా ప్రభుత్వం సమస్యల పరిష్కారం కోసం చర్యలు చేపట్టిందన్నారు. వీఆర్‌ఏలకు ఉద్యోగోన్నతులు కల్పించి ఖాళీగా ఉన్న అటెండర్, నైట్ వాచ్‌మన్, రికార్డు అసిస్టెంట్, వీఆర్వోల పోస్టుల్లో నియమించాలన్నారు. లేనిపక్షంలో మరోసారి ఉద్యమం చేసేందుకు వెనుకాడేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పి.జ్యోతి, జి.శ్రీనివాసరావు, నాగేంద్రరావు, మాధవ్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

శర్మా కాలేజీ పరిసరాలు అధ్వానం

● పట్టించుకోని అధికారులు


కళాశాల ఎదురు రహదారిలో భారీగా పేరుకుపోయిన వరదనీరు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎందరో నాయకులు, సినీ ప్రముఖులు, మేధావులు, విద్యావేత్తలను తీర్చి దిద్దిన ఒంగోలు శర్మాకాలేజీ పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. కనీసం పట్టించుకునేవారు లేక పారిశుధ్యం కొరవడి, రాకపోకలు కూడా జరిగే పరిస్థితి లేదు. కొద్దిపాటి వర్షం కురిసినా కాలేజీ రహదారి చెరువులా మారుతోంది. మరోవైపు చుట్టు పక్కల గృహాలలోని చెత్తాచెదారం వేస్తుండడంతో మినీ డంపింగ్ యార్డుగా ఆ ప్రాంతం మారిపోయింది. రాత్రి వేళ మందుబాబులకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. 73 సంవత్సరాల చరిత్ర కలిగిన శర్మా కాలేజీ సెంటర్ నేడు నిరాదరణకు గురైంది. ఇదేనా మనం చదువుకున్న కాలేజీ అంటూ పూర్వ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందిచి కాలేజీ రోడ్‌ను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు, వర్షపు నీరు నిలవకుండా, అలాగే అసాంఘీక కార్యకలాపాలను జరగకుండా అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విశ్వబ్రాహ్మణులకు అన్నివిధాలా అండగా ఉంటా !

● ఎమ్మెల్యే దామచర్ల


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కల్చరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలు దక్షిణ బైపాస్‌లోని విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపంలో జిల్లా విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సేవా సంఘం కార్తీక వన సమారాధన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో కళ్యాణ మండపానికి ఇచ్చిన స్థలం రూ.లక్షల్లో ఉండగా ఇప్పుడది కోట్ల రూపాయల విలువ చేస్తుందని, కళ్యాణ మండపానికి రావటానికి సిమెంట్ రోడ్డు ఏర్పాటు, కిటికీలు వంటి వాటిని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. విశ్వబ్రాహ్మణులకు ఇళ్ల స్థలాలకు సంబంధించి జాబితా తయారు చేసి ఇవ్వాలని, ఒక్కొరికి రెండు సెంట్లు చొప్పున అందరికీ స్థలాలు వచ్చేలా చూస్తానని చెప్పారు. తనకు విశ్వబ్రాహ్మణులంటే గౌరవమని, వారికి ఎటువంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కమ్మరి పార్వతమ్మ, నగర అధ్యక్షుడు పీఎస్.బాబు, ఏసీపీ క్రైం బ్రాంచ్ కిరణ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ రాచగండ్ల వెంకట్రావు, స్వర్ణలత, బండారు మదన్, టీడీపీ 33వ డివిజన్ అధ్యక్షుడు నల్లూరి రవి, 37వ డివిజన్ అధ్యక్షుడు మేడికొండ మోహనరావు, సేవా సంఘ అధ్యక్షుడు రావూరి లక్ష్మయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ సానల విశ్వరూపాచారి, ప్రధానకార్యదర్శి నూతక్కి మల్లేశ్వరరావు, రంగు రంగనాయకులు, యద్దనపూడి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముండువవారిపాలెంకు డ్రైనేజీ సౌకర్యం కల్పించాలి

ఒంగోలు మండల పరిధిలోని ముండవవారిపాలెం గ్రామంలోని డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను కోరారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసిన వారు పలు సమస్యలను వివరించారు. కొద్దిపాటి వర్షం కురిసినా తమ గ్రామంలో నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని చెప్పారు. వరద కారణంగా పంట పొలాలు కూడా నీట మునుగుతున్నాయని, అక్కతోగవాగు వల్ల పంటలు దెబ్బతింటున్నాయని, అందువల్ల జాతీయ రహదారి నుంచి గ్రామం వరకు డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని వినతిపత్రం అందజేశారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే దామచర్ల కార్పొరేషన్ అధికారులకు ఫోన్ చేసి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు మారెళ్ళ శ్రీధర్, సర్పంచ్ మండవ వెంకటసుబ్బయ్య, రామకృష్ణ, రాజేంద్ర, కోమటనేని ఉదయ్‌భాస్కర్, పెంట్యాల సుబ్బారావు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

● ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాసర్‌జీ


నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సంఘ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులను విద్యకు దూరం చేసే విధానాలపై ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బందెల నాసర్‌జీ పిలుపునిచ్చారు. విద్యార్థుల సమస్యలు, విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు జాత ఆదివారం ఒంగోలుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక కలెక్టరేట్ వద్ద పవన్‌కళ్యాణ్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో నాసర్‌జీ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం విద్యార్థులను శాస్త్రీయ విద్యను దూరం చేస్తున్నాయని విమర్శించారు. మూఢ విశ్వాసాలను ప్రోత్సహించే విద్యా విధానాన్ని ప్రవేశపెడుతున్నాయని మండిపడ్డారు. ప్రైవేటు విశ్వవిద్యాలయాలను ప్రోత్సహిస్తూ విద్యాహక్కు చట్టాన్ని అపహస్యం చేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన వెంటనే వంద రోజుల్లో పెండింగ్ బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చినా అమలు కాలేదన్నారు విద్యాశాఖలో ఉన్న ఖాళీల న్నింటినీ భర్తీ చేస్తామని చెప్పినా పూర్తి స్థాయిలో భర్తీ చేయలేదని విమర్శించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుజ్జుల వలరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది మంది విద్యార్థులు విద్య పూర్తి చేసినా కాలేజీల్లో ఫీజు బకాయిలు ప్రభుత్వం నుంచి రాలేదన్న కారణంతో సర్టిఫికెట్లు ఇవ్వని పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో 17మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసే విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగభూషణం, రామాంజీ, కుల్లాయిస్వామి, ఇఫ్రాజ్, తహీద్, సురేష్, జీవన్, అభుజర్ పాల్గొన్నారు.

టెట్ సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం

● ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ


సమావేశంలో మాట్లాడుతున్న బాలాజీ

ఒంగోలు విద్య, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు అందరూ తప్పనిసరిగా టీచర్ ఎలిజిబిలిటి టెస్ట్(టెట్) ఉత్తీర్ణత కావాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలతో ప్రభుత్వ విద్యాశాఖ టెట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు శవన్నగారి బాలాజీ తెలిపారు. ఈ నోటిఫికేషన్‌తో ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొందని, అయితే ఆపస్ పక్షాన సమస్యను పరిష్కరించి చూపుతామని ఆయన చెప్పారు. ఒంగోలులోని ఏకేవీకే కళాశాలలో ఆదివారం జరిగిన ఆపస్ రాష్ట్ర కార్యనిర్వహకవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు కె.మల్లికార్జునరావు అధ్యక్షతన సభ జరిగింది. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ టెట్‌పై ఇప్పటికే అన్ని జిల్లాల కలెక్టర్ల ద్వారా ప్రధానమంత్రికి వినతిపత్రాలు సమర్పించామన్నారు. ఏబీఆర్ఎస్ఎం ఆధ్వర్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్ళామని, త్వరలోనే వారిని కలిసి కేంద్ర ప్రభుత్వ సహకారంతో పార్లమెంట్‌లో చట్టాన్ని సవరించి అయినా ఇన్‌సర్వీసు టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇప్పిస్తామని ఆయన తెలిపారు. రాష్ట్ర సంఘటన కార్యదర్శి సీహెచ్.శ్రావణ్‌కుమార్, సహాధ్యక్షుడు ఎం.చక్రపాణి మాట్లాడుతూ ఏకీకృత సర్వీస్‌రూల్స్ సమస్యలను పరిష్కరించి ఉపాధ్యాయులకు అన్ని కేడర్లలో ఉద్యోగోన్నతులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గుణప్రసాద్, శంకరరావు, పెద్దరాయుడు, కేవీ.శేషారావు, ప్రసూన పాల్గొన్నారు.

తుఫాన్ సహాయక చర్యలను విస్తృతం చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి మాబు డిమాండ్



మాట్లాడుతున్న మాబు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ మిగిల్చిన అపార నష్టాన్ని సకాలంలో అంచనా వేసి బాధితులందరికీ తక్షణ సాయం అందించడంతో పాటు శాశ్వత నివారణ చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఆదివారం సీపీఎం జిల్లా కమిటీ సమావేశానికి పూనాటి ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం వల్ల జిల్లా తీవ్రంగా నష్టపోయిందన్నారు. అధికారులు వెల్లడించిన నష్టం వివరాలు ఆందోళన కలిగించేలా ఉన్నాయని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా కేవలం 25,685 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు చెప్తున్నా వాస్తవానికి ఇంకా ఎక్కువ విస్తీర్ణంలో పంటలు దెబ్బతిన్నాయన్నారు. పత్తి. సజ్జ పంటలు తీవ్రంగా దెబ్బతినగా మిర్చి, మొక్కజొన్న, వేరుశనగ పంటలు కూడా దెబ్బతిన్నాయని తెలిపారు. వరదల కారణంగా వేలాది కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని, అందువల్ల సర్వే పారదర్శకంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికీ పంట, ఆస్తి నష్టపరిహారం అందించాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు సయ్యద్‌హనీఫ్, జీవీ.కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, కంకణాల ఆంజనేయులు, ఎం.రమేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు క్రైం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా నగరంలో కొన్నిచోట్ల కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ డీఈ రంగారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. స్థానిక మంగమూరురోడ్డు, జడ్పీకాలనీ, కొత్తడొంక, జర్నలిస్టుకాలనీ, సుబ్బయ్యనగర్, మర్రిచెట్టు కాలనీ, ప్రగతీనగర్, గాంధీనగర్ ఎక్స్‌టెన్సన్ తదితర ప్రాంతాలలో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మత్స్యకారులకు రేషన్ పంపిణీ


సరుకులను అందజేస్తున్న నాయకులు

మద్దిపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గార్లపాడులో మత్స్యకారులకు తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షుడు ముత్తనపల్లి రామలింగయ్య రేషన్ సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తుఫాన్ బాధితులకు అండగా ఉంటుందన్నారు. సంక్షేమ పథకాలు అమలు ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎం.రామకృష్ణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే కొలచనకోటలో మత్స్యకారులకు దేవబత్తిన ప్రసాద్, గంటా శ్రీనివాసరావు రేషన్ సరుకులను అందజేశారు.

మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

మద్దిపాడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్ అదుపుతప్పి యువకునికి గాయాలైన సంఘటన ఆదివారం గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం వద్ద చోటుచేసుకుంది. గుంటూరు జిల్లాకు చెందిన చప్పిడి రామకృష్ణ తన మోటార్‌సైకిల్‌పై ఒంగోలు నుంచి గుంటూరు వెళ్తుండగా లారీ రావటంతో తడబడి డివైడర్‌కు ఢీకొట్టాడు. దీంతో అతనికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించారు.

సర్వే ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సర్వే ఉద్యోగుల సంఘం ఒంగోలు డివిజన్ నూతన కార్యవర్గం ఆదివారం ఎంపికైంది. స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎన్.గురవయ్య ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అధ్యక్షుడిగా సీహెచ్.కాటమరాజు, ఉపాధ్యక్షురాలిగా వి.సాహితీ, సెక్రటరీగా ఎస్.సునీల్, జాయింట్ సెక్రటరీగా షేక్ సంధానీబాషా, కోశాధికారిగా సయ్యద్ ముక్తియార్ అహ్మద్, కార్యవర్గ సభ్యులుగా జి.మాధవీదేవి, ఎస్.సుశాంత్, షేక్ గౌస్‌బాషా, పి.కోటేశ్వరరావు, డి.మునలయ్య, పి.అరుణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ సర్వేయర్ ఆవుల శ్రీనివాసరావు, కె.రమణయ్య, పలువురు సర్వే ఉద్యోగులు నూతన కమిటీని అభినందించారు.

187 మందికి వైద్య పరీక్షలు


పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని దేవుడుచెరువు పార్కులో ఆదివారం శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, దేవుడు చెరువు డవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్‌కు బీపీ, షుగర్ ఈసీజీ, హెచ్‌బీ, ఎముకల పటుత్వం, పాదాల నరాల స్పర్శ ఊపిరితిత్తుల సామర్థ్యత పరీక్షలను నిర్వహించారు. ఈ శిబిరాన్ని సుమారు 187 మంది వినియోగించుకున్నట్లు హాస్పిటల్ అధినేత డాక్టర్ చాపల వంశీకృష్ణ తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు చాపల శాంతకుమారి, సానల ధీరజ్, చైతన్యప్రియ, అసోసియేషన ప్రతినిధులు పాల్గొన్నారు.

బాధితులకు తక్షణ సాయం అందించాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ఒంగోలులో తీవ్రంగా నష్టపోయిన బాధిత కుటుంబాలకు తక్షణ సాయం అందించాలని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నగరంలోని 15 డివిజన్ల పరిధిలోని 54 కాలనీలు ముంపునకు గురై సుమారు 25వేల కుటుంబాలు నష్టపోయాయని తెలిపారు. ఒక వైపు వర్షపు నీరు, మరో వైపు వరద నీటితో వేలాది ఇళ్ళు ముంపునకు గురై ప్రజలు కట్టుబట్టలతో మిగిలిపోయారన్నారు. ఇళ్లలోని సరుకులతో పాటు ఎలక్ట్రానిక్ పరికరాలు కూడా దెబ్బతిన్నాయని, అందువల్ల ప్రభుత్వం బాధిత కుటుంబాలకు తక్షణ సాయం అందించి ఆదుకోవాలని ఆయన కోరారు.

రైజ్ అధ్యాపకుడికి డాక్టరేట్


పూర్ణచంద్రరావు

ఒంగోలు విద్య, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న కందిమళ్ళ పూర్ణచంద్రరావుకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. హెల్త్‌కేర్‌లో పరిశోధన చేసి వ్యాధిగ్రస్తులు, వ్యాధి నిర్ధారణ, చౌక వైద్యం, హాస్పటల్ నిర్వహణలో ఉత్తమమైన మార్గాలను అన్వేషించినందుకు ఆచార్య నాగార్జున యూనివర్శిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం డాక్టరేట్‌ను ఆదివారం అందజేసింది. ఈ సందర్భంగా డాక్టరేట్‌ను పొందిన పూర్ణచంద్రరావును కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

వసతి గృహాల వద్ద పారిశుధ్య పనులు

సంతనూతలపాడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని ఎస్సీ, బీసీ వసతి గృహాల వద్ద ఆదివారం మండల స్పెషల్ ఆఫీసర్ పి.శ్రీహరి, ఎంపీడీవో డి.సురేష్‌బాబు ఆదేశాల మేరకు పారిశుధ్య పనులు నిర్వహించారు. ఎంఈవో వెంకారెడ్డి ఆధ్వర్యంలో వసతిగృహాల సమీపంలో బ్లీచింగ్ చల్లించారు. కిటికీలకు దోమలు రాకుండా ఇనుప వలని ఏర్పాటు చేయించారు. విద్యార్థులకు కాచి చల్లార్చిన నీటిని ఇవ్వాలని వార్డెన్లకు సూచించారు. అదేవిధంగా వసతిగృహాల్లోని నీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలన్నారు.

భక్తుల మృతికి సంతాపం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల మృతికి సంతాపంగా వైసీపీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఒంగోలులో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. స్థానిక బాపూజీ కాంప్లెక్స్ వద్ద ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ భక్తులు మృతి బాధాకరమన్నారు. ఆలయాల్లో దుర్ఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, నాయకులు కుప్పం ప్రసాద్, వై.వెంకటేశ్వరరావు, బొట్లా రామారావు, కటారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో పూజలు

కొండపి, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): షిర్డిసాయి తత్వ ప్రచార దీక్షా సంవత్సరంలో భాగంగా భక్తి ప్రచార కార్యక్రమం ఆదివారం కొండపి సాయిబాబా ఆలయంలో నిర్వహించారు. అలాగే ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకుడు నారాయణ మూర్తిపంతులు, సభ్యులు అద్దేపల్లి శ్రీనివాసరావు, సీతారామయ్య, అద్దేపల్లి శ్రీనివాసరావు, ఇజ్జిగిరి మస్తాన్, చలువాది సృజన్ పాల్గొన్నారు.

సమస్యలతో శాంతినగర్ వాసులు సతమతం

● పట్టించుకోని అధికారులు

సంతనూతలపాడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పేర్నమిట్టలోని శాంతినగర్‌వాసులు పలు సమస్యలతో సతమవుతున్నారు. కనీసం తాగేందుకు కూడా నీరు అందించలేని స్థితిలో మున్సిపల్ అధికారులు ఉన్నారని స్థానికులు వాపోతున్నారు. ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని శాంతినగర్‌కు నీటిని అందించే బోరు 10 రోజుల క్రితం మరమ్మతులకు గురైంది. దానికి గురించి ఎవరూ పట్టించుకోలేదు. కనీసం నీటి ట్యాంకర్లను పంపించడంలేదని ఆదివారం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు వారాల నుంచి కురిసిన వర్షాలకు వీధుల్లో మురుగు పారుదల లేక చెత్తచెదారంతో పిచ్చిచెట్లతో నిండిపోయాయి. పారిశుధ్యం అధ్వానంగా ఉండటం తో ఎక్కడ వ్యాధుల బారిన పడతామేమోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శాంతినగర్‌లోని సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

సస్యరక్షణతోనే పంటలకు మేలు

ముంపు పైర్లను కాపాడుకునేందుకు జాగ్రత్తలు

రైతులకు అధికారుల సూచనలు



వర్షపు నీరు నిలిచి ఎర్రగా మారుతున్న బొప్పాయి

త్రిపురాంతకం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తుపాన్ ప్రభావం తగ్గగానే రైతులు తమ పొలాల్లో పంటలను పరిశీలించి వాటిని తిరిగి యథాస్థితికి తెచ్చుకునే ప్రయత్నాల్లో నిమగ్నమై ఉన్నారు. వర్షపు నీరు నిలిచి కొన్నిచోట్ల, గాలుల తీవ్రతకు నేలకొరిగిన ఇంకొన్నిచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. పంటలను నష్టపోతామనే ఆందోళన నుంచి రైతులు ఇంకా బయటపడలేదు. ఉన్నారు. అటువంటి వారికి ముఖ్యంగా మిర్చి, బొప్పాయి తదితర ఉద్యాన పంటల రైతులకు ఉద్యానశాఖ అధికారులు పలు సూచనలు చేశారు. సత్వరమే సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా పంటలను కాపాడుకోవచ్చని తెలియజేస్తున్నారు.

అధికారుల సూచనల్లో ప్రధానంగా...



నీళ్లలో పొగ మొక్కలు

- పంటల్లో నిలిచి ఉన్న నీటిని సత్వరమే బయటకు పంపివేయాలి. నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకుని వాటిని గండ్లు పెట్టి బయటకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలి.
- నేలకొరిగిన మిర్చి మొక్కలను పైకి తీసి మట్టిని తొక్కి నిలువుగా నిలబడేలా చేయాలి
- వర్షాలు పడ్డాయని వెంటనే పంటలకు సత్తువ మందు వేయకూడదు.
- ప్రస్తుతం భూమిలో అధిక తేమశాతం, తరచుగా వర్షాలు కురిసి మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా మొక్కలు భూమిలో నుంచి బలం తీసుకునే పరిస్థితి ఉండదు.
- వెంటనే 19:19:19 లేదా 13-0-45 లేదా యూరియా వంటి పోషకాలను పంటలపై పిచికారీ చేయాలి.
- సూక్ష్మపోషకాలను ఐదు గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- ఉద్యాన పంటల్లో నీరు నిలిచి వేరు కుళ్లు, కాండం కుళ్లు కనిపిస్తోంది. దీనికి కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు ఒక లీటరు నీటి చొప్పున కలిపి, లేదా బ్లైటాక్స్ నీళ్లలో కలిపి మొక్క మొదళ్ల దగ్గర పోయాలి.
- రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గటం కారణంగా ఆకుమచ్చ బూజు తెగులు వ్యాపిస్తుంది. దీని నివారణకు మ్యాంకోజెబ్ 2 గ్రాములు లీటరు నీటికి, డైమిథోమార్ఫ్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- అధిక వర్షాల వల్ల బొప్పాయిలో ఆకులు ఎర్రగా మారటం కనిపిస్తే రెడొమిల్ లేదా ఎలైట్ రెండు గ్రాములు లీటరు నీటికి కలిపి చెట్టు మొదటి దగ్గర పోయాలి.

రోడ్డు మార్జిన్‌లో వినాయక విగ్రహం ఏర్పాటు

అద్దంకి మినీ బైపాస్ రోడ్డు నిర్మాణం అడ్డుకొనేందుకనే అనుమానం

వెంటనే తొలగించాలని కమిషనర్ హెచ్చరిక



ఎన్ఎస్‌పీ కాలువ కట్ట, ఆర్ అండ్‌బీ రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం

అద్దంకి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఒక వైపు ఆర్ అండ్‌బీ రోడ్డు మార్జిన్, మరో వైపు అద్దంకి మేజర్ కాలువ కట్టలను ఆక్రమించి వినాయక హడావుడిగా వినాయక విగ్రహం ఏర్పాటు చేయడం రాజకీయ చర్చకు దారితీసింది. వైసీపీ 1వ వార్డు కౌన్సిలర్ కొత్తగొర్ల వెంకటసుబ్బారావు(బాలు) తన ఇటుకబట్టీ వద్ద హడావుడిగా వినాయకుడి విగ్రహం ఏర్పాటు చేయించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్, ఎన్ఎస్‌పీ అధికారులు పరిశీలించి సోమవారం ఉదయానికి విగ్రహాన్ని తొలగించాలని చెప్పారు. అద్దంకిలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు మినీ బైపాస్ రోడ్డు నిర్మాణంపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ పద్ధతిలో నిర్మాణం చేసేందుకు అంగీకారం తెలిపింది. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఆమోదం తెలిపేందుకు శుక్రవారం నిర్వహించిన సమావేశంలోని అజెండాలో చేర్చారు. తొలి విడతగా నామ్ రోడ్డు నుంచి రేణింగవరం రోడ్డు వరకు అద్దంకి మేజర్ కాలువకు రెండు వైపులా కట్టలను అభివృద్ధి చేసేందుకు సుమారు రూ.15 కోట్లను మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంజూరు చేయించారు. పీపీపీ పద్ధతిలో కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణం చేస్తే మున్సిపాలిటీ నుంచి ఏటా కొంత మొత్తాన్ని కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సి ఉంది. రెండో విడతలో కాకానిపాలెం నుంచి శింగరకొండ వరకు మినీ బైపాస్ నిర్మాణం చేసే ఆలోచనతో ఉన్నారు. మున్సిపల్ సమావేశంలో మినీ బైపాస్ రోడ్డు విషయంపై 1వ వార్డు కౌన్సిలర్ రచ్చ చేశారు. దీనిని బట్టి మినీబైపాస్ రోడ్డును ఏదో రకంగా అడ్డుకునే ఉద్దేశంతోనే తన ఇటుక బట్టీ సమీపంలో కాలువకట్టను, అద్దంకి-బల్లికురవ-సంతమాగులూరు ఆర్అండ్‌బీ రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించి వినాయకుడి విగ్రహం చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ విషయం తెలుసుకున్న ఎన్ఎస్‌పీ, మున్సిపల్ అధికారులు పరిశీలించారు. సోమవారం ఉదయానికి తొలగించుకోవాలని చెప్పారు. లేదంటే మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తొలగించాల్సి ఉంటుందని కమిషనర్ రవీంద్ర హెచ్చరించారు. వినాయకుడి విగ్రహాన్ని అడ్డుపెట్టి మినీ బైపాస్ రోడ్డును అడ్డుకునే ప్రయత్నం వైసీపీ నేతలు చేస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

భార్య కుటుంబ సభ్యుల దాడి.. ఆ తర్వాత భర్త మృతి

టంగుటూరులో ఘటన.. మృతుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఒంగోలు (క్రైం), నవంబరు 2 : భార్య కుటుంబ సభ్యులు దాడి చేయడం.. ఆ తర్వాత భర్త మృతి చెందడం సంచలనమైంది. ఈ ఘటన టంగుటూరులో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు టంగుటూరులోని శ్రీనివాస నగర్‌కు చెందిన పల్లపు వంశీకుమార్(30) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు అదే కాలనీకి చెందిన దివ్యకీర్తితో 2019లో వివాహమైంది. వారికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆరు నెలల క్రితం వీరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. అప్పటి నుంచి దివ్యకీర్తి పుట్టింట్లో ఉంటోంది. రెండు దఫాలు పెద్దమనుషులు రాజీ చర్చలు చేసినప్పటికీ సఫలం కాలేదు. ఈనేపథ్యంలో వంశీకుమార్ శనివారం రాత్రి హైదరాబాద్ నుంచి బయల్దేరి ఆదివారం ఉదయం టంగుటూరుకు చేరుకున్నారు. 11 గంటల సమయంలో పిల్లలను చూసేందుకు అత్తగారింటికి వెళ్లారు. అక్కడ వంశీకుమార్‌తో దివ్యకీర్తి తండ్రి అయిన తన్నీరు సుబ్రహ్మణ్యం, బామ్మర్ది జయకుమార్ గొడవపడ్డారు. దీంతో వంశీకుమార్ తన పెద్దనాన్న ఇంటికి చేరాడు.అక్కడికి వచ్చిన వంశీకుమార్ మామ, బామ్మర్ది మరలా గొడవపడి వంశీకుమార్‌పై దాడి చేశారు. కొద్దిసేపటి తర్వాత వంశీకుమార్ గుండె నొప్పితో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు టంగుటూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. ఈ మేరకు వంశీకుమార్ బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతికి భార్య కుటుంబ సభ్యులే కారణమని అందులో పేర్కొన్నారు. ఎస్సై నాగమల్లేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

జై చెన్నకేశవా..

వైభవంగా మార్కాపురంలో చెన్నుడి తెప్పోత్సవం.. ఘనంగా కార్యక్రమం



స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే, అధికారులు



శేషపాన్పుపై చెన్నకేశవస్వామి

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి పుష్కరిణిలో ఆదివారం రాత్రి క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా చెన్నకేశవస్వామికి తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయం నుంచి ఉభయదేవేరులతో చెన్నకేశవస్వామి.. బాణసంచా కాల్పులు, మంగళ వాయిద్యాలు, భాజాభజంత్రీల నడుమ 4వ వార్డులోని పుష్కరిణి వద్దకు చేరుకున్నారు. అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు ఆధ్వర్యంలో అర్చక బృందం అక్కడ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రంగనాయక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేతుడై చెన్నయ్య ప్రత్యేకంగా అలంకరించిన తెప్పపై వేంచేశారు. వేదమంత్రాలు చదవి, హారతులు ఇచ్చి తెప్పోత్సవాన్ని ప్రారంభించారు. రంగనాయక అలంకారంలో చెన్నకేశవస్వామి పుష్కరిణిలో జలవిహారం చేస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. 3 సార్లు పుష్కరిణిలో తెప్పను తిప్పారు. రంగురంగుల విద్యుత్ దీపాల మధ్య కోనేటిలో విహరిస్తున్న చెన్నయ్యను దర్శించుకుని భక్తులు పులకించిపోయారు. ఈ సందర్భంగా చెన్నకేశవ నామస్మరణ మార్మోగిపోయింది. మహిళా భక్తులు కోలాటాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఆలయ ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి, తెప్పోత్సవంలో శాశ్వత ఉభయదాతలు, కౌన్సిలర్ డాక్టరు చెప్పల్లి కనకదుర్గ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు. డీఎస్పీ నాగరాజు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. అగ్నిమాపక శాఖ, మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



కోలాటాలు వేస్తున్న భక్తులు

కూలిన చారిత్రక గోపురం

మొంథా తుపానుతో కురిసిన భారీ వర్షాలతో ఘటన

క్షీణదశకు చేరుతున్న కొణిదెనలో ఉన్న చెన్నకేశవ స్వామి దేవాలయం

గుడికెళ్లాలంటే భయపడుతున్న భక్తులు



పూర్తిగా పడిపోయిన చెన్నకేశవ స్వామి దేవాలయ గోపురం

బల్లికురవ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : చారిత్రాత్మక కొణిదెన చెన్నకేశవ స్వామి దేవాలయ గోపురం మొంథా తుపాను ప్రభావంతో కూలింది. లోపల గోడలు కూడా పగుళ్లిచ్చాయి. పైకప్పు కూడా కూలేందుకు సిద్ధంగా ఉంది. దీంతో ఈ దేవాలయానికి భక్తులు వెళ్లాలంటే భయపడుతున్నారు. ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనకు గురవుతున్నారు.

● స్వామి అంటే ఎంతో నమ్మకం..

మండలంలోని కొణిదెన గ్రామంలో ఉన్నత పాఠశాలకు తూర్పు భాగంలో కొండపై ఉన్న చెన్నకేశవ స్వామి అంటే ఈ ప్రాంత భక్తులకు ఎంతో నమ్మకం. ఈ దేవాలయం దేవదాయ, పురావస్తు శాఖల పరిధిలో ఉంది. ఏటా పలు ప్రాంతాల నుంచి భక్తులు ఈ దేవాలయానికి వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఇంతటి ప్రసిద్ధి చెందిన దేవాలయం కొంతకాలంగా శిథిలావస్థకు చేరుతోంది.



పూర్తిగా పడిపోయిన గోపురం

● రెండేళ్ల క్రితం కొంత కూలిన గోపురం

రెండేళ్ల క్రితం వర్షాలకు ఆలయ గోపురం కొంత పడిపోయింది. అప్పటి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. గోపురం పాక్షికంగా కూలినప్పటికీ యథాతథంగా పూజలు కొనసాగిస్తున్నారు. ఇటీవల మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో చెన్నకేశవస్వామి దేవాలయం గోపురం మొత్తం పడిపోయింది. దేవాలయం లోపల కూడా గోడలు, పైకప్పు బాగా దెబ్బతింది.

● కార్తీక మాసం పూజలకు వస్తున్న భక్తులు

కార్తీక మాసం కావడంతో కొణిదెన, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు ప్రతి రోజూ దేవాలయానికి వచ్చి పూజలు చేసి వెళుతున్నారు. దేవాలయంలో ప్రమాదం జరుగుతుందని కొణిదెన ప్రజలు ఆందోళనలో ఉన్నారు. పూజారి సైతం ప్రతి రోజూ దూప దీప నైవేద్యం పెట్టి వెంటనే దేవాలయం లోపల నుంచి బయటకు వస్తున్నారు. చోళరాజులు పరిపాలన చేసిన చరిత్ర గలిగిన కొణిదెనలో చెన్నకేశవ స్వామి దేవాలయం పడిపోయేలా ఉన్న ఎవరూ పట్టించుకోవటం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. ప్రమాదాలు జరిగాక వచ్చి హడావుడి చేసే అధికారులు దేవాలయం గురించి, భక్తుల ప్రాణాల నుంచి పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. దేవాలయానికి భూములు ఉన్నా అధికారులు వాటికి కౌలు వేలం పాట పాడే సమయంలో తప్ప దేవాలయం అభివృద్ధి గురించి పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే దేవదాయశాఖ నిధులతో పురాతనఆలయాన్ని వెంటనే అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.

వైభవంగా మహారుద్రాభిషేకం

పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి దంపతులు

10 వేల మందికి పైగా భక్తుల హాజరు



శివలింగానికి మహారుద్రాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి దంపతులు

గిద్దలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా గిద్దలూరులో మహారుద్రాభిషేకం, మహాభస్మాభిషేకం ఘనంగా నిర్వహించారు. 8 అడుగుల మట్టి శివలింగానికి హిమాలయ సాధువులచే ఆదివారం రాత్రి మహారుద్రాభిషేకం, మహాభస్మాభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి దంపతులు రుద్రాభిషేకం, భస్మాభిషేకం పూజల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సుమారు 10వేల మందికి పైగా భక్తులు మహారుద్రాషేకానికి హాజరై వీక్షించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పోలంరెడ్డి భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బైలడుగు బాలయ్య, మున్సిపల్ కమిషనర్ రమణబాబు, హిందూ దేవాలయాల కమిటీ అధ్యక్షుడు చేరెడ్డి యర్రారెడ్డి, వివిధ దేవస్థానాల ప్రతినిధులు, టీడీపీ నాయకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.



శివునికి అభిషేకం చేస్తున్న హిమాలయ సాధువులు

హ్యాండ్‌బాల్ టోర్నమెంట్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి డాక్టర్ స్వామి

సింగరాయకొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో నిర్వహించనున్న అండర్ -19 బాలబాలికల అంతర్ జిల్లాల హ్యాండ్‌బాల్ టోర్నమెంట్ పోటీల వాల్‌పోస్టర్‌ను మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆదివారం టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఒంగోలు డీఐఈవో కె.ఆంజనేయులు, హ్యాండ్‌బాల్ అండర్-19 కార్యదర్శి చింపారెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి శంకర్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్వీ ప్రసాద్, చంద్రశేఖర్, రవికిరణ్, బలరాం, నాగేశ్వరరావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రైవేటు సెక్యూరిటీ గార్డు అనుమానాస్పద మృతి

ముురుగు కాలువలో తేలాడిన మృతదేహం



కాలువలో శీనయ్య మృతదేహం

ఒంగోలు క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలో ప్రైవేటు సెక్యూరిటీ గార్డుగా పని చేసే స్వర్ణ శీనయ్య(52) అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. ఈ సంఘటన స్థానిక ప్రగతి కాలనీ వద్ద ఆదివారం వెలుగుచూసింది. వివరాల్లోకెళ్తే... నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడుకు చెందిన శీనయ్య ఒంగోలు నగరంలో ప్రైవేటు సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుంటాడు. శనివారం సాయంత్రం ఇంటి నుంచి ఒంగోలు వచ్చాడు. ఆదివారం ఉదయం ప్రగతి కాలనీ వద్ద ఉన్న మురుగు కాలువలో అతని మృతదేహం కనిపించింది. అతనికి మద్యం సేవించే అలవాటు ఉందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. కాలువపై ఉన్న దిమ్మెలపై కూర్చొని మద్యం సేవించి మత్తులో అందులో పడి ఉండొచ్చని ప్రాథమికంగా పోలీసులు అంచనాకు వచ్చారు. మృతుని వద్ద మద్యం బాటిల్, రూ.700, ఫోన్ నంబర్లు వేసి ఉన్న పేపరు దొరికాయి. ఈ మేరకు తాలూకా ఎస్సై ఫిరోజ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి అనుమానాస్పద కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఒంగోలులో జిల్లాస్థాయి చెస్, యోగా పోటీలు

పంగులూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో సోమవారం ఎస్‌జీఎఫ్ 69వ జిల్లాస్థాయి చెస్, యోగా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి ప్రతిమ తెలిపారు. ఒంగోలులోని యూటీఎఫ్ కార్యాలయం పైఅంతస్తులో 3వ తేదీ ఉదయం 9 గంటలకు అండర్-14, అండర్-17 బాలబాలికల చెస్ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు అండర్-14, అండర్-17 బాలబాలికల యోగా పోటీలు నిర్వహించనున్నట్లు ప్రతిమ తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే జట్టుకు ఎంపిక చేయనున్నట్లు వివరించారు.

ఐదు గేట్ల ద్వారా గుండ్లకమ్మ నీరు విడుదల

మద్దిపాడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వరద నీరు గుండ్లకమ్మ ప్రాజెక్టులోకి చేరుతోంది. ప్రాజెక్టులోకి 11900 క్యూసెక్కుల వరద నీరు రావడంతో అధికారులు ఐదు గేట్ల ద్వారా 11800 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్ట్ ఏఈ రామాంజనేయులు తెలిపారు. ప్రాజెక్టు లెవెల్‌ను 23.8 మీటర్ల వద్ద స్థిరీకరణ చేశామన్నారు. రిజర్వాయర్‌లో 3.3 టీఎంసీల నీటిని నిల్వ చేసినట్లు తెలిపారు. వరద తీవ్రతను బట్టి మరో గేటు ద్వారా నీటిని బయటకు విడుదల చేస్తామని ఆయన చెప్పారు.

5న జ్వాలాతోరణం

గిద్దలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈనెల 5వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు జ్వాలాతోరణం, ఆకాశదీప కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షుడు వాడకట్టు రంగసత్యనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ తెలిపారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రుని జయంతి వేడుకలు

ఎర్రగొండపాలెం రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జయంతి కార్యక్రమాలు ఆదివారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని యక్కలివారి వీధిలోని ఉన్న ఆలయంలో రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు ముత్తలూరి మల్లికార్జునాచారి ప్రత్యేక పూజకార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జమ్మోజి వెంకటేశ్వరాచారి, యక్కలి బాగ్యరావు, ఆతుకూరి రామయ్య, సొసైటీ అధ్యక్షుడు వీరయ్య, నాగేశ్వరరావు, ప్రసాద్, వెంకటేశ్వరరావు, అల్లూరయ్య, భక్తులు పాల్గొన్నారు.

చినుకు పడితే నడవలేం



కొలుకులలో బ్రహ్మంగారి మఠం రోడ్డు దుస్థితి



కొత్తపల్లిలోని ప్రధాన రహదారిలో గుంతల్లో ఉన్న నీరు

- గ్రామాల్లో రహదారులు అధ్వానం
- ఐదేళ్లూ మట్టి కూడా వేయని వైసీపీ పాలకులు
- శాశ్వత రోడ్లు నిర్మించాలని ప్రజా ప్రభుత్వానికి ప్రజల విజ్ఞప్తి

ఎర్రగొండపాలెం రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): చినుకు పడితే చాలు ఆ రహదారులపై నడవలేని పరిస్థితి నెలకొంటుంది. గ్రామాలు, పట్టణాల్లో పలు ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో తట్టెడు మట్టిని కూడా వేసిన పాపాన పోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్త రోడ్లు వేయకపోగా ఛిద్రమైన రోడ్లను కూడా జగన్‌రెడ్డి, పాలకులు మరమ్మతులు కూడా చేయలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా శాశ్వత రహదారుల ఏర్పాటుకు ప్రజా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.మండలంలోని కొలుకుల, కొత్తపల్లి, గురిజేపల్లి, బోయలపల్లి గ్రామాలతో పాటు పలు గ్రామాలలో రోడ్లు బాగులేవు. ప్రజా ప్రభుత్వం వచ్చాక కొన్ని గ్రామాల్లో రోడ్లు, సీసీ రోడ్లను నిర్మించారు. అదే మాదిరిగా మిగతా గ్రామాల్లో కూడా రోడ్లను వేయాలని కోరుతున్నారు. కొలుకులలోని బ్రహ్మంగారి మఠం నుంచి రాములవారి గుడికి వెళ్లే రహదారి, కొత్తపల్లిలోని ప్రధాన రహదారి, గురిజేపల్లిలో ప్రధన రహదారి నుంచి గుడిపాడు గ్రామానికి వెళ్లే రహదారి, బోయలపల్లి నుంచి గుడిపాడు వెళ్లే దారి, గుర్రపుశాల నుంచి తమ్మడపల్లి ఇలా అన్ని గ్రామాలలో ఇదే పరిస్థితులు ఉన్నాయని మండల ప్రజలు అంటున్నారు. పాలకులు, అధికారులు స్పందించి అంతర్గత రోడ్లను వేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఆలయం వద్ద నిర్మిస్తున్న అరుగు

గుడి వద్ద నూతన అరుగు నిర్మాణం

కంభం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణం వై.జంక్షన్ సమీపంలో ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక స్వామి గుడికి సంబంధించిన అరుగును ఆదివారం హిందూ సంఘాల ఐక్య వేదిక వారు పునఃనిర్మించారు. వివరాలలోకి వెళితే.. వైజంక్షన్ సమీపంలో ఉన్న వరసిద్ధి వినాయక స్వామి గుడి అరుగును కొంతమంది వ్యక్తులు గత నెల 19వ తేదీ కూల్చి వేయడంతో హిందువులు ఆగ్రహం వ్యక్తం చేయడం కాక అరుగును కూల్చిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. దీంతో గొడవ సద్దుమనిగింది. ఈ నేపథ్యంలో హిందూ ఐక్య వేదిక వారు ఆదివారం కూల్చిన అరుగు స్థానంలో నూతన అరుగును నిర్మించడం జరిగిందని తెలిపారు.

విద్యార్థులకు డిక్టేషన్ పోటీలు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు

గిద్దలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాఖ గ్రంథాలయం ఆవరణలో చదవడం మాకు ఇష్టం అనే కార్యక్రమంలో భాగంగా బాలబాలికలకు డిక్టేషన్ పోటీలు నిర్వహించారు. సీనియర్స్ బాలుర విభాగంలో స్వరూప్, హబీబ్, అవినాష్, జూనియర్స్ బాలికల విభాగంలో హర్షిత్‌రెడ్డి, భానుశ్రీ, అశ్వనీ విజేతలు కాగా యువ ప్రగతి పథం సభ్యులైన న్యాయవాది సిద్ధయ్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కిశోర్, కార్యదర్శి ఫరూఖ్, గ్రంథపాలకురాలు ప్రసన్న కుమారి పాల్గొన్నారు.



పార్వతమ్మకు స్వాగతం పలుకుతున్న సంఘ ప్రతినిధులు

విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

కార్పొరేషన్ చైర్మన్ పార్వతమ్మ

గిద్దలూరు టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విశ్వబ్రాహ్మణుల సంక్షేమం, సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కమ్మరి పార్వతమ్మ తెలిపారు. ఆదివారం ఒంగోలు వెలుతూ గిద్దలూరులో కొద్దిసేపు ఆగారు. విశ్వబ్రాహ్మణ సంఘం స్థానిక ప్రతినిధులు ఆమెను కలిశారు. ఈసందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు షరాఫ్ దత్తాచారి, గౌరవాధ్యక్షుడు దొడ్డోజు రంగాచారి, సంఘ సభ్యులు కమ్మరి క్రిష్ణమాచారి, షరాబ్ నరసింహాచారి, గూడలూరి శంకరాచారి, పొద్దుటూరి సాయికుమార్‌చారి, బి.గురుస్వామిలు కమ్మరి పార్వతమ్మను శాలువా, పూలమాలలతో సన్మానించారు. అనంతరం పార్వతమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, యువతకు ఉపాధి అవకాశాలు, విద్యార్థులకు అందిస్తున్న ప్రోత్సాహక పథకాలు, మహిళలకు ఆర్థిక స్థిరత్వం వంటి అంశాలపై దృష్టి సారించినట్లు తెలిపారు. యువత తమ సామాజిక బాధ్యతను గుర్తించి సేవా కార్యక్రమాలలో ముందుండాలని పిలుపునిచ్చారు.

మండల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలు ఆడేందుకు సిద్ధంగా ఉన్న ఉపాధ్యాయులు

కంభం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రోజువారీ బోధనా కార్యక్రమాలతో నిత్యం బిజీగా ఉండే ఉపాధ్యాయులకు ఆటవిడుపుగా క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమని ఎంఈవో-1 అబ్దుల్ సత్తార్ అన్నారు. ఆదివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగాణంలో మండల స్థాయి ఉపాధ్యాయ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఆరోగ్య అవగాహన, టీం స్పిరిట్ పెంపుదల లక్ష్యంగా పాఠశాల విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకుందని, ఈ పోటీలు మండల, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నాలుగు దశల్లో నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సయ్యద్ ఆదిల్, ఖాశింపీరా, కోలా సునీల్ కుమార్, బషీర్, అహ్మద్, గోపి, వేణుగోపాలచారి, రవికిషోర్ రెడ్డి ఖాశింవలి, సుధాకర్ పాల్గొన్నారు.

పీపీపీ పద్ధతిని విరమించుకోవాలి



మాట్లాడుతున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి రమేష్

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలను పీపీపీ పేరుతో నిర్వహించడాన్ని వెంటనే విరమించాలని ఏపీ ప్రభుత్వ రిటైర్డ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ఐఏఎస్ అధికారి, ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర చైర్మన్ డా. పీవీ రమేష్ డిమాండ్ చేశారు. పూలసుబ్బయ్య శాంతి భవన్‌లో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తు ఆదివారం ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ కన్వీనర్ డా. బాలవెంకటేశ్వర్లు అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. ఏపీలో వైద్యాన్ని వ్యాపారంగా మార్చారని, కార్పొరేట్ వైద్యం ప్రజల్ని అప్పులపాలు చేస్తుందన్నారు. విద్యా, వైద్యం, ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగాలన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల కన్వీనర్ డా. ఆల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అనేక దేశాలలో అమలులో ఉన్న విధంగా విద్య వైద్యం ప్రభుత్వ రంగంలోనే కొనసాగితేనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. గత వైసీపీ పాలనలో 107, 108 జీవోల ద్వారా ప్రభుత్వ మెడికల్ సీట్లను అమ్ముకుంటే ఈ ప్రభుత్వం మెడికల్ కాలేజీలను అమ్ముకుంటుందన్నారు. సదస్సులో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కృష్ణయ్య, దళిత ఉద్యమ నేత వినయ్‌కుమార్, సమాజ్ వాదీ రాష్ట్ర అధ్యక్షుడు పాశం వెంకటేశ్వర్లు, ప్రభుత్వ మెడికల్ కళాశాలల కో కన్వీనర్ డా. వసుంధర, హైకోర్టు న్యాయవాది శ్రీదేవి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. టి.సురేష్, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేవీ కృష్ణగౌడ్, నాయకులు అందె నాసరయ్య, కాశిం, సీపీఎం నాయకులు సోమయ్య, దళిత, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహిళా కార్యదర్శిగా షకీల

గిద్దలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీ కళా వేదిక ప్రకాశం జిల్లా శాఖ మహిళా కార్యదర్శిగా స్థానిక రైల్వే ఉద్యోగి షేక్ షకీల నియమితులయ్యారు. కవయిత్రిగా, రచయిత్రిగా, యాంకర్‌గా పేరుప్రఖ్యాతలు సాధించిన షకీల కళావేదిక జిల్లా మహిళా కార్యదర్శిగా ఎంపికవడం పట్ల పలువురు ఆమెను అభినందించారు.

చెరువు కట్టపై రహదారిని నిర్మిస్తాం

ఎమ్మెల్యే నారాయణరెడ్డి



చెరువు కట్ట రహదారిపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల

మార్కాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం చెరువుకట్టపై నూతన రహదారిని త్వరలోనే నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి తెలిపారు. స్థానిక చెరువుకట్టను ఆదివారం ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ప్రభుత్వం ఇటీవలె కట్టపై నూతన రహదారి నిర్మాణానికి రూ.4కోట్లు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో అంచనాలు ఏ విధంగా రూపొందించారు, రహదారిని ఏ విధంగా నిర్మిస్తారు అనే అంశాలపై ఆర్‌అండ్‌బీ అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. ప్రధానంగా స్థానిక రాజయ్య మటన్ షాప్ సమీపం నుంచి ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్దగల అలుగు వరకు 2.5 కిలోమీటర్ల మేర ప్రస్తుతం ఉన్న రహదారి స్థానే నూతన రహదారి నిర్మాణం చేపట్టనున్నట్లు ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. పనులు నాణ్యతతో జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఏఈ షేక్ షబ్బీర్, ఏఎంసీ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైనది

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



సన్మానగ్రహీతలతో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ముత్తుముల భాస్కర్‌రెడ్డి కల్యాణ మండపంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందనీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమం జరిగింది. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి కొత్తగా ఉపాధ్యాయులుగా నియమితులైన వారికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఒక ఉపాధ్యాయుడు ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థాయికి తీర్చిదిద్ది, సమాజంలో గుర్తింపు, ఎదుగుదలకు కృషి చేస్తారని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు, కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో కార్తీక మాస పూజలు

త్రిపురాంతకం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): త్రిపురాంతకంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం సామూహిక శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి వ్రత కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో 35మంది ఆర్యవైశ్య దంపతులు పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు అనంతయ్య, సాయి సత్యనారాయణ స్వామి వ్రత మహిమలను, సంస్కృతి సాంప్రదాయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పూర్ణ నాగేశ్వరరావు, యువజన సంఘం అధ్యక్షులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు జాతర



మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారులలోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్ల నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లు చేశారు. భక్తులు కుంకుమ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా క్షీరాబ్ది ద్వాదశి పూజలు



ఉసిరి చెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు

తర్లుపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడులో క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా అనంత లక్ష్మీనారాయణ స్వామి (ఉసిరి చెట్టు)కి పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులు ఉసిరి చెట్టుకు శ్రీకృష్ణుడు, వెంకటేశ్వర స్వామి, గణేష్ మహారాజ్ ఉసిరి చెట్టు వద్ద చిత్రపటాలు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశైలం వాసవీసత్రం జాయింట్ కార్యదర్శి పోలేపల్లి జనార్దన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేణుగోపాలస్వామి ఆలయ ధర్మకర్త జవ్వాజి విజయ భాస్కర్‌రావు, సహస్ర లింగేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త నేరెళ్ల పవన్ కుమార్, చినమగుండ్ల సుబ్రహ్మణ్యం, భక్తులు పాల్గొన్నారు.

5 నుంచి దీక్షధారులకు భిక్ష

గిద్దలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ ఉమామహేశ్వర సహిత అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఈనెల 5వ తేదీ నుంచి జనవరి 5వ తేదీ వరకు 60రోజులపాటు అయ్యప్ప దీక్షధారులకు ఉచితంగా సద్ది, భిక్ష కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు దేవస్థాన కమిటీ ప్రతినిధులు, అన్నదాన కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. దీక్షధారులకు మధ్యాహ్నం సద్ది, రాత్రి భిక్ష ఉంటుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పశ్చిమ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య



పత్తిని పరిశీలిస్తున్న కృష్ణయ్య

మార్కాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన పశ్చిమ ప్రకాశం రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య కోరారు. మండలంలోని నికరంపల్లి, వేములకోట, నాగులవరం గ్రామాల్లో రైతు సంఘం నాయకులు ఆదివారం పర్యటించారు. వర్షాలతో దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించి, రైతులతో మాట్లాడి నష్టం వివరాలను తెలుసుకున్నారు. ప్రధానంగా పత్తి, మిర్చి దెబ్బతిన్నట్లు తెలిపారు. ప్రతి రైతుకూ న్యాయం జరిగేలా అధికారులు నష్టం అంచనా రూపొందించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు డి.సోమయ్య, పాపిరెడ్డి, అడివయ్య, గంగిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నాగయ్య, పెద్దనాగులవరం మాజీ సర్పంచ్ పిన్నిక అల్లూరయ్య పాల్గొన్నారు.

వైసీపీ నిర్లక్ష్యం.. అసంపూర్తిగా నిర్మాణం

- పూర్తికాని గ్రామ సచివాలయం
- మధ్యలోనే నిలిచిన ఆర్బీకే, హెల్త్ క్లినిక్ సెంటర్
- భవనాలు లేక ఉద్యోగులు, ప్రజలకు ఇబ్బందులు



అసంపూర్తిగా ఉన్న గ్రామ సచివాలయం

పుల్లలచెరువు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నిర్లక్ష్యంతో ప్రజా అవసరాలు తీర్చే భవనాలు అంసపూర్తిగా ఉన్నాయి. వైసీపీ హయాంలో కొమరోలులో నిర్మించిన ప్రభుత్వ భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. ఉపాధి పథకం ద్వారా రూ.40లక్షలతో గ్రామ సచివాలయం, రూ.22లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.20లక్షలతో హెల్త్ క్లినిక్ సెంటర్‌లను మంజూరు చేసి పనులు ప్రారంభించారు. వాటి నిర్మాణం కోసం 600 టన్నుల ఇసుకను అప్పటి వైసీపీ నాయకులు అక్రమంగా దోసుకున్నారు. దీంతో ఏడాది పాటు పనులు నిలిచిపోయాయి. ఆ తరువాత స్థానిక కాంట్రాక్టర్‌లు పనులు ప్రారంభించినా నిధుల లేమితో ఆపేశారు. సచివాలయం 60 శాతం వరకు పనులు చేసినా ఫినిషింగ్ చేయకుండా అసంపూర్తిగా ఉంది. రైతు భరోసా కేంద్రం 50 శాతం పనులతో అసంపూర్తిగా, హెల్త్ క్లినిక్ సెంటర్‌కు స్లాబ్ వేసి పనులు నిలిపివేశారు. ఐదేళ్లుగా అవి అసంపూర్తి పనులతో వినియోగంలోకి తీసుకురాలేదు. దీంతో అటు సిబ్బంది, ఇటు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజా అవసరాల నిమిత్తం నిర్మించిన భవనాలను పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

విధిలేక విధులు

- కొత్త భవనం నిర్మాణం కాక పాత ఇంట్లోనే కార్యకలాపాలు
- ఇబ్బందులుపడుతున్న సచివాలయ సిబ్బంది

రాచర్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సత్యవోలు గ్రామ సచివాలయ సిబ్బంది విధిలేక విధులు నిర్వహిస్తున్నారు. కొత్త భవనంలోకి వెళ్లాలంటే ఎవరూ ఇవ్వక ప్రస్తుతం పాత భవనంలో విధులు నిర్వహించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో సచివాలయ అద్దె భవనమంతా వర్షపు నీటితో అస్తవ్యస్తంగా మారి సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాల ప్రభావంతో కార్యాలయంలో ఉన్న ఫర్నిచర్, కంప్యూటర్లు తదితర పరికరాలు తడిసిపోతున్నాయి. వాటిని ఓ మూలకు చేర్చి వాటిపై ప్లాస్టిక్ పట్టలు కప్పారు. సిబ్బంది కూర్చునేందుకు కూడా వీలులేని పరిస్థితి ఏర్పడింది. వైసీపీ పాలనలో గ్రామ సచివాలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అయితే కొన్ని పంచాయతీల్లో నిర్మాణాలు పూర్తి కాలేదు. కొన్ని చోట్ల అర్థాంతరంగా పనులు నిలిచిపోయాయి. సత్యవోలు సచివాలయ పరిస్థితి అంతే. పనులు ఎందుకు నిలిచిపోయాయో అధికారులు, కాంట్రాక్టర్లకే తెలియాలి. సచివాలయ భవనం లేక సత్యవోలు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వరుసగా వానలు కురుస్తుండడంతో నీటిలోనే సిబ్బంది పనిచేస్తున్నారు. కొత్త భవనం పూర్తికాక, పాత భవనంలో విధులు నిర్వహించలేక మరో భవనానికి వెళ్దామంటే ఎవరు అద్దెకు ఇవ్వక దిక్కుతోచని స్థితిలో సిబ్బంది ఉన్నారు. అధికారులు స్పందించి గ్రామ సచివాలయ భవనాన్ని నిర్మించడమో లేక ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడమో చేయాలని ప్రజలు కోరుతున్నారు.



అద్దె భవనంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది



వైసీపీ పాలనలో అర్ధంతరంగా ఆగిపోయిన సచివాలయ భవనం

రైల్వే సిబ్బందికి వైద్య పరీక్షలు



రైల్వే బోగీలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రకాష్

దొనకొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): హెల్త్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులకు ఆదివారం రైల్వేస్టేషన్‌లో వైద్య పరీక్షలు నిర్వహించారు. గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ సుదేన్షసేన్ ఆధ్వర్యంలో గుంటూరు నుంచి ప్రారంభమైన హెల్త్ ఆన్ వీల్స్ ప్రత్యేక రైలు దొనకొండ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. సీనియర్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.ప్రకాష్ నేతృత్వంలో పారా మెడికల్ సిబ్బంది, ఓమేగా హాస్పటల్, శంకర్ కంటి వైద్యశాల వైద్య బృందం 103 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

కార్తీక వనభోజనాలు

పామూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీకమాసం సందర్భం గా పామూరు ఆరేమరాత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన కార్యక్రమాలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని అను మునిగిరి క్షేత్రంలో ఈకార్యక్రమం నిర్వహించారు. ఆరేమరతా సంఘం నా యకులు జగదాబి మాల్యాద్రి, దైండే శివశంకర్, దైండే తిరుపతయ్య, జాజం చినసుబ్బయ్య, జాజం శ్రీనివాసులు, గాయకవాడ సురేష్, దైండే రామాం జనేయులు జె.నాగేశ్వరరావు, జాజం శివాజి, జాజం సుబ్బారావు, శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరులో భారీ వర్షం



పసుపుగల్లులో కురుస్తున్న వర్షం

ముండ్లమూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం అరగంట పాటు భారీ వర్షం కురిసింది. పసుపుగల్లు, చింతలపూడి, వేములబండ, కమ్మవారిపాలెం, వేముల గ్రామాల్లో వీధులన్నీ జలమయమయ్యాయి. పెదఉల్లగల్లు, బసవాపురం, కెల్లంపల్లి, పులిపాడులో ఓమోస్తరు వర్షం కురిసింది. ఈవర్షం మొక్కజొన్న సాగుచేసిన రైతులకు తీవ్ర నష్టం చేకూర్చింది.

టీడీపీ పటిష్టతకు కృషి

పామూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ పటిష్టతకు కృషి చేస్తామని టీడీపీ మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు, పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గంధం బాబు అన్నారు. ఆదివారం కనిగిరిలోని అమరావతి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై ఎంతో నమ్మకంతో ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించడం పట్ల గంధం బాబు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఉగ్రను శాలువాతో ఘనంగా సత్కరించారు. కాగా, టీడీపీ వాణిజ్య విభాగం కనిగిరి నియోజకవర్గ అధ్యక్షుడుగా పామూరుకు చెందిన పందిటి హరీష్ నియమితులయ్యారు. ఈసందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

ఘనంగా సమాధుల పండుగ

దొనకొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సమాధుల పండుగ సందర్భంగా క్రైస్తవులు ఆదివారం ఆత్మల పండుగను క్రైస్తవుల శ్మశానవాటికలో సంబరంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆర్సీఎం, సీఎస్ఐ, లూతరన్ చర్చీల సంఘ కాపరులు శ్మశాన వాటికలోని ప్రతి సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మహిళపై దాడి

కనిగిరి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కత్తితో మహిళపై దాడిచేసిన ఘటన ఆదివారం పట్టణంలోని గార్లపేట రోడ్డులోని సామిల్ వీధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొనకనమిట్ల మండలం పెదారికట్ల గ్రామానికి చెందిన సుబ్బులు అనే మహిళ పట్టణంలోని నగరికంటి బసవయ్యసెంటర్‌లో పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంది. గత రెండేళ్ళుగా సామిల్ వీధిలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని కుటుంబ సభ్యులతో జీవిస్తుంది. శివ అనే వ్యక్తి కూడా ఎమ్మెస్సార్ రోడ్డులో తోపుడు బండిపై పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఇతని నివాసం కూడా సుబ్బులు ఇంటి సమీపంలోనే ఉంది. ఆదివారం సుబ్బులు తన ఇంటిలోని పూజాగదిలో దీపారాధన చేస్తుండగా శివ ఇంట్లోకి ప్రవేశించి ఆమె మెడపై కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో సుబ్బులుకు తీవ్రగాయాలుకాగా స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ టి.శ్రీరాం ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కాగా, శివతో గొడవలు రావడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మద్యానికి బానిసై మానసికస్థితి కోల్పోయి అందరితో గొడవకు దిగుతున్నాడని స్థానికులు చెప్తున్నారు.

వర్షాలకు దెబ్బతిన్న చప్టాలు

- కూలే పరిస్థితి నెలకొనటంతో ఆందోళన చెందుతున్న ప్రజలు

దర్శి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు అన్నీ రకాలుగా నష్టం జరిగింది. దర్శి ప్రాంతంలో పంటలతో పాటు రోడ్లు, బ్రిడ్జిలు, చప్టాలు దెబ్బతిన్నాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దర్శి-ఆరవల్లిపాడు రోడ్డులో తూర్పువెంకటాపురం వద్ద పెద్దవాగుపై నిర్మించిన లోలెవల్ బ్రిడ్జి పూర్తిగా దెబ్బతింది. తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఈవాగు ఉధృతంగా ప్రవహించింది. అంచులు కొట్టుకొని



దర్శి - ఆరవల్లిపాడు రోడ్డులో తూర్పువెంకటాపురం వద్ద దెబ్బతిన్న లోలెవల్ బ్రిడ్జి



దర్శి - పాదిలి రోడ్డులో కాటేరువాగుపై దెబ్బతిన్న చప్టా

పోవటంతో వాగు, ఎన్ఏపీ పైప్‌లైన్ ధ్వంసమయ్యాయి. దీంతో ఎగువప్రాంత గ్రామాలకు మంచినీరు నిలిచిపోయింది.. దర్శి-పాదిలి రోడ్డులో కాటేరువాగుపై సుమారు 70 ఏళ్ల క్రితం నిర్మించిన చప్టా పూర్తిగా దెబ్బతింది. గతంలోనే బ్రిడ్జి సామర్థ్యం కోల్పోయి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఈవాగు ఉధృతంగా ప్రవహించడంతో ఇరువైపులా అంచులు మరింత కొసుకుపోయి ఎప్పుడు కూలుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాజంపల్లి - బొద్దికూరపాడు రోడ్డులో లక్ష్మీనారాయణపురం వద్ద వాగుపై నిర్మంచిన లోలెవల్ బ్రిడ్జి కూడా దెబ్బతింది. దెబ్బతిన్న బ్రిడ్జిలకు మరమ్మతులు చేయకపోతే ఏ నిమిషంలోనైనా కూలే ప్రమాదముంది. అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్య క్షేత్రంగా వెలుగొందుతున్న గుంటిగంగ సన్నిధిలోని గంగమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. భక్తులు పొంగళ్లు పెట్టి చల్లగా చూడమని వేడు కున్నారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకపూజారి ఎస్.కామేశ్వర శర్మ భక్తులకు గోత్రనామ పూజలు నిర్వహించారు. పూజారులు ప్రకాశ్ పంతులు, విజయలక్ష్మి, బాలరా జులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో జి.వాసుబాబు, ఆర్ఏ ప్రసాద్, తదితరులు పాల్గొన్నా రు.



ముండ్లమూరులో ప్రత్యేక అలంకరణలో వీర్లంకమ్మ



తాళ్లూరు: ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

పోలేరమ్మకు పొంగళ్లు

ముండ్లమూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులో ఇటీవల ప్రతిష్ఠించిన వీర్లంకమ్మ, అంకమ్మతోపాటు గ్రామంలోని పోలేరమ్మ, బొప్పూడివారిపాలెం పోలేరమ్మ, నూజెండ్లపల్లి, సుంకరవారిపాలెం, పోలవరం గ్రామాల్లో వేంచేసి ఉన్న పోలేరమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పొంగళ్ళు పెట్టి నైవేద్యం సమర్పించారు. దేవతా మూర్తులను ప్రత్యక అలంకరణ చేశారు.



పామూరు: స్వామివార్లకు నైవేద్యం తెస్తున్న భక్తులు

నారాయణస్వామికి ప్రత్యేక పూజలు

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మం డలం మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివార్ల మూలవిరాట్‌కు అభిషేకాలు, కుం కుమార్చన పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భం గా స్వామివార్లకు మహానైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నా రు. అనంతరం గోశాలలోని గోమాతకు పసుపు, కుంకుమతో ప్రత్యేక పూజ లు నిర్వహించారు. తదనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కా ర్యక్రమాల్లో దేవస్థాన చైర్మన్ కొమ్మినేని చినఆదినారాయణ, ఈవో నరసిం హబాబు, ఉపసర్పంచ్ పాములపాటి నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

ముండ్లమూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రజాప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ వైస్‌చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పూరిమెట్లలో మొంథా తుఫా న్‌తో దెబ్బతిన్న మొక్కజొన్న, మిరప, కంది పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిచిన మొక్క జొన్నను కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. తొందరపడి దళారులకు అమ్మకో వద్దన్నారు.

కార్యక్రమంలో ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబరు నాగలపాటి నాగేశ్వరరాజు, సీపీఎం నాయకుడు బోడపాటి హనుమంతరావు, ఎంపీటీసీ చింతలపల్లి వెంకటేశ్వరరావు, నిడిగంటి నారాయణ, రమణాల ఏడుకొండలు, రమణాలవారిపాలెం మాజీ సర్పంచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు

ముండ్లమూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియో గదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్టు రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ వైస్‌చైర్మన్ మర్రెడ్డి శ్రీని వాసరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పూరిమెట్లలో నూతనంగా ఏర్పాటుచేసిన ట్రా న్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభిం చారు.

ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజాప్ర భుత్వం అధి కారంలోకి వచ్చిన 16 నెలల కాలంలో గ్రామాల్లో దీర్ఘకా లికంగా శిథిలావస్థలో ఉన్న స్తంభాలు మార్చి కొత్తవి ఏర్పాటుచేసినట్టు చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌డీఎస్ పథకం ద్వారా పనులు ముమ్మరంగా జరుగు తున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ కోడెగ మస్తాన్‌రావు, ఓగులూరి నాగేశ్వరరావు, తాని పర్తి నర్సారెడ్డి, చొప్పరపు నాగేశ్వరారావు, గోపీ, ఏరేసు చంద్రశేఖరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పూరిమెట్లలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి

తాగునీరు కలుషితం

- ఇబ్బందులు పడుతున్న విఠలాపురం ప్రజలు

వీసీపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తాగునీరు కలు షితమవుతుండటంతో మండలంలోని విఠలాపురం వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు డీప్‌బోర్ పక్కనే ఉన్న పేడదిబ్బ వద్ద నిలి చిన నీరు ఊటదిగి డీప్‌బోర్‌లోకి చేరింది. దీంతో తాగు నీరు రంగుమారి కలుషితమైంది. దీంతో వ్యాధులు ప్ర బలే అవకాశంఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

మండలంలోని విఠలాపురం గ్రామ ప్రజల దాహార్తి తీర్చేందుకు పాఠశాల పక్కనే డీప్‌బోర్ ఏర్పాటు చేశారు. ఆబోరు నీటినే ప్రజలు వినియోగించుకుంటు న్నారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి డీప్‌బోర్ పక్కనే పేడదిబ్బ వేశాడు. మొంథా తుఫాను ప్రభావంతో ఇటీ వల కురిసిన వర్షాలకు దిబ్బ వద్ద నిలిచిన నీరు ఊట దిగి బోరు నీటిలో కలవడంతో తాగునీరు కలుషితమై రంగుమారి దుర్వాసన వస్తున్నట్లు గ్రామస్థులు పేర్కొ న్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల పంచాయతీ కార్యదర్శి ఎక్స్‌కవేటర్ ద్వారా పేడదిబ్బను కొంచెం పక్కకు నెట్టించాడే కానీ పూర్తిగా తొలగించలేదని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పం దించి తాగునీరు కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



డీప్‌బోర్ పక్కనే ఉన్న పేడదిబ్బ



రంగుమారిన తాగునీరు

రోడ్డుపై గుంతలు పూడ్చివేత

తాళ్లూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తాళ్లూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి శ్రీసరస్వతీ హైస్కూల్ వరకు రోడ్డుపై ఉన్న గుంతలను శ్రీసరస్వతీ విద్యాసం స్థల అధినేత ఏవీ రమణారెడ్డి సొంత నిధులతో పూడ్చించారు. ఈరోడ్డు గుండా నిత్యం హైవేరోడ్డు నిర్మాణం కోసం ఇటీవల టిప్పర్లు అధికంగా తిరుగుతుండటంతో గుంతలమయమైంది. దీనికితోడు ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా దెబ్బతిని వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈమార్గం గుండానే శ్రీసర్వస్వతీ హైస్కూల్‌కు విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు మరమ్మతుల గురించి ఎవరూ పట్టించుకోక పోవటంతో రమణారెడ్డి సొంత నిధులు వెచ్చించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా గుంతలను పూడ్చించారు.



తాళ్లూరులోని పీహెచ్‌సీ మార్గంలో తాత్కాలిక మరమ్మతులు

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి

దొనకొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆనంద ఆశ్రమంలో ఆదివారం శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 417వ జయంతి వేడుకలను ఆశ్రమ ధర్మకర్త కాకర్ల భైరవానంద స్వామి ఆధ్వ ర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసంద ర్భంగా బ్రహ్మేంద్రస్వామిని ప్రత్యేకంగా అ లంకరించారు. ఈసందర్భంగా పంచామృత అభిషేకాలు, గణపతి పూజ, శ్రీ వీరబ్రహ్మ అష్టోత్తర సహస్రనామార్చనలు, తదితర పూజలు నిర్వహించారు. ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి దంపతులు అన్నదాన కార్యక్ర మం నిర్వహించారు.

పామూరు: పోతులూరి వీరబహ్మేంద్ర స్వామి 417వ జయంతి వేడుకలను ఆది వారం స్థానిక విరాట్‌నగర్‌లోని గోవింద మాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి దేవ స్థానంలో వైభవంగా నిర్వహించారు. ఉద యం గణపతిపూజ, హోమాలు, అభిషేకా లు, పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివార్ల మూలవిరాట్‌లను ప్రత్యేక అ లంకరణచేశారు. ఈసందర్భంగా యాగశాల లో చండీదేవత హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో వీరబ్రహ్మేంద్రస్వామి



ప్రత్యేక అలంకరణలో స్వామివార్లు



చండీదేవత హోమాల్లో పాల్గొన్న భక్తులు

భైరవకోనను సందర్శించిన సీఐ



భైరవకోన జలపాతం వద్ద మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని భైరవకోన క్షేత్రాన్ని సీఐ మాకినేని శ్రీనివాసరావు ఆదివారం సందర్శించారు. జలపాతం వద్ద పర్యాటకుల సందడిని తిలకించారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈనెల 5న కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్తీక మాసం రెండో సోమవారం, కార్తీక పౌర్ణమి రోజున కొండపైకి వాహనాలు, దిచక్రవాహనాలకు ప్రవేశం కల్పించవద్దన్నారు. జలపాతం వద్ద తగిన జా గ్రత్తలు తీసుకోవాలని ఆలయ నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎం. వెంకటేశ్వరనాయక్, తదితరులు పాల్గొన్నారు.

శివలింగ ప్రతిష్ఠకు రావాలని ఎమ్మెల్యే ఉగ్రకు ఆహ్వానం

వీసీపల్లి, నవంబ రు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద యిర్లపాడు మహారు ద్రపీఠంలో ఈనెల 17 న జరగనున్న శివలిం గ ప్రతిష్ఠకు ఏర్పాట్లు వేగంగా జరుగుతు న్నాయి. ఈకార్యక్ర మానికి ఎమ్మెల్యే డా క్టర్ ఉగ్రనరసింహారెడ్డిని మహారుద్రపీఠం వ్యవస్థాపకుడు పలుకూరి సు బ్బారావు ఆహ్వానించారు. ఆదివారం కనిగిరిలో ఎమ్మెల్యేను కలిసిన సుబ్బా రావు ఆహ్వాన పత్రికను అందజేసి శివలింగ ప్రతిష్ఠ విశేషాన్ని వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ శివలింగ ప్రతిష్ఠ కార్యక్రమం లో తప్పనిసరిగా పాల్గొంటానని చెప్పారు.



ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న పలుకూరి సుబ్బారావు

కరాటేలో ప్రతిభచాటిన విద్యార్థులు

పామూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్జీవో కాలనీ ఒకటవ లైనులో గల ది ఛాంపియన్ కరాటే డో స్టోర్‌లో ఆదివారం నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ పోటీల్లో పలువురు విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పర్పుల్ బెల్ట్ విభాగంలో ఎస్డీ దోహా, కె.యశస్విని, కె.లాస్య, కె.అభిజ్ఞ, బ్లూ బెల్ట్ విభాగంలో సీహెచ్ కార్తిక, గ్రీన్ బెల్ట్ విభాగంలో తేజేస్‌రెడ్డి, ఆరెంజ్ బెల్ట్ విభాగంలో ఈ.జైత్రేష్, కె.హస్విక, పి.తేజస్వి, బి.నిత్య, బి.ధాత్రివర్షిణి, ఎల్లో బెల్ట్ విభాగంలో జి.గాయత్రి, పి.హస్విక, ఎం.సాయివర్షిత, మోక్షిత, నిరంజన్, లౌక్య, శ్రీహాస్, కె.జస్వంత్ ప్రతిభచాటారు. ప్రతిభచూపిన విద్యార్థులకు మాస్టర్ అబ్దుల్ వహిద్ ప్రశంసా పత్రాలు, బెల్ట్‌లు అందజేసి అభినందించారు.

నిబద్ధతతో పనిచేసిన రఘురామయ్య

దర్శి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): విధుల నిర్వహణలో ఎంతో నిబద్ధతతో పనిచేసిన ఎంఈవో రఘురామయ్య అందరి మన్ననలు పొందారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. దర్శి ఎంఈవోగా పనిచేస్తూ గతనెల 31న ఆయన ఉద్యోగ విరమణ చేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు, ఆత్మీయులు దర్శిలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన సభ లో ఆమె మాట్లాడుతూ 30 సంవత్సరాల పాటు ఉపాధ్యాయుడిగా, ప్రధానో పాధ్యాయుడిగా, విద్యాశాఖ అధికారిగా రఘురామయ్య విశేష సేవలందిం చారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఐఏఎస్ మాజీ అధికారి సత్యనారా యణ, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, డీజీఈ శ్రీనివాసరెడ్డి, జేఏ సర్వీసెస్ సుబ్బారావు, ఆర్‌జెడీ లింగేశ్వరరెడ్డి, డీఈవో కిరణ్‌కుమార్, నియోజకవర్గంలోని ఎంఈవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసే టీడీపీలో చేరికలు

దర్శి నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతు న్న అభివృద్ధిని చూసి వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర వ్యా ప్తంగా పెద్ద ఎత్తున టీడీపీలో చేరుతున్నారని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. మండలంలోని బొట్లపాలెంలో ఆదివారం రాత్రి వైసీపీకి చెందిన కొర్రపాటి సుబ్బులు, ఏసోబు, ఏలూరి పేరయ్య కు టుంబాలు టీడీపీలో చేరారు. డాక్టర్ లక్ష్మి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో జరు గుతున్న అభివృద్ధిని చూసి, ప్రభుత్వ పథకాల అమలును గుర్తించి వైసీపీని వీడి టీడీపీలో చేరడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు పుచ్చ అచ్చిరెడ్డి, నాయకులు ఉల్లి ఆంజనేయులు, జి.తిమోతి, జి.శ్యాంసన్, విశ్వాసం, చిన్న ఏసు పాల్గొన్నారు. అనంతరం గ్రామానికి చెందిన ఆలూరి పేరయ్యకు రూ.13,800, జి.యోహాన్‌కు రూ.41వేలు సీఎం సహాయనిధి చెక్కులను డాక్టర్ లక్ష్మి అందజేశారు.



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి


బాపట్ల రూరల్‌లో ముంపులోనే వరిపైరు

ఆక్రమణలో.. ఆనవాళ్లు

- ఘనకీర్తికి మారుపేరుగా మందడం, మల్కాపురం
- సజీవ శిలాజాలుగా శివాలయం, నందిశాసనం, కోనేరు
- పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని ప్రజల వేడుకోలు


గణపతిదేవుని ఆధ్వర్యంలో విశ్వేశ్వర శంభు నిర్మించిన శివాలయం

శౌర్యానికి.. ధైర్యానికి ప్రతీకగా నిలిచే రాణి రుద్రమదేవి అంటే నేటికీ తెలుగునాట ఘనకీర్తి. రాజధాని అమరావతితో కాకతీయుల రాణికి ప్రత్యేక అనుబంధం ఉంది. అమరావతి భూభాగంలో ఆమె ఎన్నోసార్లు నడయాడారు. కాకతీయ సామ్రాజ్యం పాలనా పగ్గాలను చేపట్టడానికి ముందునుంచే రుద్రమదేవి తండ్రి గణపతి దేవునితో కలిసి తరచుగా మల్కాపురం వచ్చిపోతుం డేవారు. ఈ ప్రాంతంలోని ఓ కొలనంటే ఆమెకు ఎంతో మక్కువ. ఆ కొలను ఒడ్డున కూర్చొని సేదతీరేవారు. ఈ ప్రాంతంపై తనకున్న ప్రేమాభిమానాల కొద్దీ ఆమె తన జన్మదినోత్సవాన్ని ఇక్కడే ఎంతో అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఇక్కడి మహిళల గర్భకోశ వ్యాధుల చికి త్సల కోసం ఏకంగా ఓ ప్రసూతి వైద్యశాలనే ఆమె కట్టిం చారు. రాణీ రుద్రమదేవిని అంతగా ఆకట్టుకున్న ఆ ప్రదేశమే నేటి మల్కాపురం. రుద్రమదేవి తాలూకు ఆనవాళ్లు ఇప్పటికీ అక్కడ కనిపిస్తూనే ఉన్నాయి. అయితే ఆ ఆనవాళ్లు నేడు ఆక్రమణలకు గురయ్యాయి. వీటిని పట్టించుకునేవారు లేరు. ఘన చరిత్రకు ఆనవాళ్లుగా ఉన్న ఈ ప్రాంతాన్ని రాష్ట్రప్రభుత్వం గుర్తించి, రుద్రమదేవి తాలూకు ఆనవాళ్లను పరిరక్షించి దీనినో పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


అమరావతిలో రుద్రమదేవి గుర్తులు శిథిలం

(అమరావతి, ఆంధ్రజ్యోతి)

రుద్రమదేవి చరిత్ర తెలంగాణకే కాదు.. యావత్ తెలుగుప్రాంతానికంతా సుపరిచితమే. వరంగల్ కేంద్రంగా ఆమె పాలన కొనసాగినప్పటికీ నేటి రాజధాని అమరావతి ప్రాంతం కూడా అప్పట్లో ఆమె ఏలుబడిలోనిదే. రుద్రమదేవి తండ్రి గణపతిదేవుని కాలం నుంచే ఈ ప్రాంతంలో కాకతీయులకు అనుబంధం ఉండేది. తనకు రాజగురువుగా కొనసాగిన విశ్వేశ్వర శంభు అనే శివాచార్యునికి ఈ ప్రాంతాన్ని బహుమతిగా ఇచ్చారు గణపతిదేవుడు. రాయపూడి మొదలు పెనుమాక వరకు ఉన్న పదికిపైగా గ్రామాలను ఈ విశ్వేశ్వరశంభుకు అప్పగించారు. నాలుగు గొప్ప రాజవంశాలకు రాజగురువుగా వ్యవహరించారు. కృష్ణానది ఉత్తరవాహినిగా ఉన్న ఈ ప్రాంతాన్ని కాకతీయ చక్రవర్తి విశ్వేశ్వరశంభుకు అప్పగించారు. మల్కాపురంలో విశ్వేశ్వరశంభు గోళకీమఠాన్ని స్థాపించారు. గోళకీ మఠం అంటే శివాలయం. వేదవిద్యతో కూడిన మహా విద్యాలయ సముదాయం. అప్పట్లో ఈ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల సందర్భంగా పదిమంది నృత్యకళాకారిణులు నాట్యం చేస్తుండేవారు. 14 మంది మహిళా గాయకురాండ్రు, వివిధ రకాల వాయిద్యాలను వాయిస్తూ మరో 16 మంది సంగీత కళాకారులు ఉండేవారు.. అర్చనల నిమిత్తం ఆరుగురు, ఆలయ నైవేద్యాల కోసం మరో ఇద్దరు బ్రాహ్మణులు ప్రత్యేకంగా ఉండేవారు. వీరభద్రుల పేరిట పది గ్రామాలను సంరక్షించడానికి 73 మందితో కూడిన ప్రత్యేక సైనికదళం (మిగతా 8లో)


మల్కాపురంలో రాయ గజకేసరి రాణీ రుద్రమదేవి వేయించిన శిలాశాసనం

ఘనంగా రుద్రమా జయంత్యుత్సవం

1261 మార్చి 25న రుద్రమదేవి తన జన్మదినోత్సవాన్ని మల్కాపురంలోని గోళకీమఠంలో ఎంతో వైభవంగా జరుపుకున్నారు. ఆ సందర్భంగా శివాలయానికి తూర్పు దిక్కుగా ఓ భారీ శిలాశాసనాన్ని వేయించారు. అది ఇప్పటికీ చెక్కుచెదర కుండా ఉంది. దీనిని నంది శాసనమమని, నాగశాసనమని వ్యవహరిస్తుంటారు. ఈ శాసనంపై ఆలయం వైపు నంది విగ్రహం.. మరోవైపు పడగవిప్పి సర్పం చెక్కబడి ఉండటమే ఇందుకు కారణం. దీనిపై నాటి జయంత్యుత్సవాల నిర్వహణ, చేసిన దానాల గురించి విపులంగా తెలుగు, సంస్కృత భాషల్లో లిఖించారు. ఈ సందర్భంలోనే రుద్రమదేవి ఆలయానికి తూర్పు ఈశాన్యంగా ఓ కోనేరును తవ్వించడంతోపాటు మంద డం పరిధిలో ఓ ప్రసూతి వైద్యశాలను ఏర్పాటు చేయించారు. అప్పట్లో గర్భిణులు సుఖప్రసవాలు లేక మృత్యువాత పడుతుండడాన్ని చూసి రుద్రమదేవి ఎంతగానో చలించిపోయి ఈ ప్రసూతి వైద్యశాలను అన్ని సదుపాయాలతో ఏర్పాటుచేయించారు. ఈ ప్రస్తావన కూడా ఆ శాసనంలో ఉంది. తాను సామ్రాజ్ఞిగా పట్టాభిషక్తురాలైన తర్వాత కూడా రుద్రమదేవి ఇక్కడికి ఎన్నోమార్లు వచ్చారు. తాను నిర్మించిన కోనేరు ఒడ్డున కూర్చొని సేదతీరుతుండడం ఆమెకు ఇష్టమైన అలవాటుగా ఉండేదంటారు. 1289లో జరిగిన ఓ మహాసంగ్రా మంలో రుద్రమదేవి వీరమరణం పొందిన తర్వాత కూడా చాలాకాలం ఈ ప్రాంతం గొప్పగానే వెలుగొందుతూ వచ్చింది.

నష్టం అపారం

- ప్రభుత్వానికి నివేదికలు
- 84,500 ఎకరాల్లో పంటలు మునక
- 152 కిలోమీటర్ల మేర రహదారులు ఛిద్రం
- విద్యుత్ శాఖకు రూ.3 కోట్ల వరకు నష్టం
- మళ్లీ భయపెడుతున్న వర్షం హెచ్చరికలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ మిగిల్చిన నష్టం అంచనాల విషయంలో యంత్రాంగం ఓ అంచనాకు వచ్చింది. జిల్లావ్యాప్తంగా 84,500 ఎకరాల్లో పంటలు ముంపుబారిన పడినట్లు వ్యవసాయశాఖ ప్రభుత్వానికి నివేదించింది. ఇందులో వరి విస్తీర్ణం 68,000 ఎకరాలు ఉండగా, మినుము 4,600, మొక్కజొన్న 3,600 ఎకరాలు ప్రధానంగా ఉన్నాయి. 1100 స్తంభాలు నేలకొరిగాయని, 200 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని వీటికి సంబంధించి రూ.3 కోట్ల వరకు నష్టం విద్యుత్‌శాఖకు వాటిల్లినట్లు అధికారులు తేల్చారు. 152 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతినగా ఆ నష్టం రూ.2 కోట్లు ఉండవచ్చని అధికారులు తెలిపారు. 416 చెట్లు నేలకొరగగా, ప్రధాన వాగులన్నింటికీ గండ్లు పడ్డాయి. వీటికి మరో రూ.15 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్లు యంత్రాంగం ప్రాథమికంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించింది.

నష్టపోయిన వారందరికీ..

సోమవారంతో నష్టం వివరాల తుది జాబితాను ఎయిమ్స్‌లో అధికారులు నిక్షిప్తం చేయనున్నారు. దీనికి తోడు మాన్యువల్‌గా కూడా అవకాశం ఇవ్వాలనే నిర్ణ యానికి ప్రభుత్వం యంత్రాంగం వచ్చిం ది. ఈ-క్రాప్‌లో నమోదు కాకుండా ముంపుబారిన పడిన పంటలను మాన్యువల్‌గా జాబితా తయారు చేయాలనేదే ప్రభుత్వ ఆలోచనగా ఉంది. ఇందుకు సంబంధించి అధికారిక ఆదేశాలు వెలువడాల్సి ఉందని వ్యవసాయశాఖ చెబుతోంది. వీటిని క్రోడీకరించి ఈ వారం చివరికి అర్హులైన వారి జాబితాను ఆర్‌ఎస్‌కేలలో ప్రదర్శించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. తదుపరి అభ్యంతరాల స్వీకరణ అనంతరం తుది జాబితా విడుదల చేసేలా వ్యవసాయశాఖ అడుగులేస్తోంది.

మళ్లీ వర్షం హెచ్చరికలు...

అల్పపీడన ప్రభావంతో ఈ నెల 4, 5 తేదీల్లో మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉందనే వాతావరణశాఖ హెచ్చరికలు రైతులను కలవరపెడుతున్నాయి. ఆదివారం బాపట్లలో చిరుజల్లులు కురవగా, పిట్టలవానిపాలెం మండలంలో ఓ మోస్తరు వర్షం పడింది. దీంతో అన్నదాతలు ఆందోళనకు గురయ్యారు. నాలుగు రోజులుగా పొలాల్లో వర్షపు నీరు నిలిచే ఉందని, అవి బయటకు పోవడానికి మరో రెండు రోజులు పడుతుందని మళ్లీ వర్షాలు అంటే పంటలపై ఆశలు వదిలేసుకోవడమేనని రైతులు వాపోతున్నారు.

బీచ్‌లు.. బంద్

- కార్తీక స్నానాలకు అనుమతి నిరాకరణ
- నిరాశతో వెనుతిరిగిన పర్యాటకులు

బాపట్ల, వాడరేవు(చీరాల), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్ ప్రభావంతో సముద్ర తీరం ప్రమాదకరంగా మారిందని బీచ్‌లను మూసేశారు. తుఫాన్ కల్లోలం కారణంగా తీరమంతా గుంతలతో నిండిపోయాయి. దీంతో సూర్యలంక, వాడరేవు, రామాపురం తీరంలో పరిస్థితి ప్రమాదక రంగా ఉంది. అయితే కార్తీక మాసం పైగా ఆదివారం కావటంతో సముద్రతీరానికి ఉదయం నుంచి పెద్దఎత్తున భక్తులు, పర్యాటకులు తరలివచ్చారు. సుదూర ప్రాంతాలు నుంచి సముద్ర స్నానాల కోసం ప్రత్యేక వాహనాల్లో కుటుంబసమేతంగా వచ్చినవారిని పోలీసులు సముద్రంలోకి అనుమతించలేదు. బయట నుంచి బయటే వారిని వెనక్కి పంపించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసు అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో వారంతా నిరాశతో వెనుతిరగాల్సి వచ్చింది. మరో రెండురోజులు తీరానికి పర్యాటకుల అనుమతి ఉండదని అధికారులు ప్రకటించారు. అయితే 5వ తేదీ కార్తీక పౌర్ణమిరోజైనా అనుమతిస్తారా అంటూ పర్యాటకులు, భక్తులు ప్రశ్నించగా వారి నుంచి స్పష్టత లేదు. సూర్యలంక సముద్రతీరానికి సోమ,మంగళవారాల్లో పర్యాటకులకు, భక్తులకు అనుమతి లేదని ఆర్డీవో పి.గ్లోరియా తెలిపారు. వాతావరణం అనుకూలించకపోవడంతో మత్స్య, రెవెన్యూశాఖల ఆదేశాల మేరకు బీచ్‌లను మూసేసినట్లు డీఎస్పీ జి.రామాంజనేయులు తెలిపారు. వాతావరణంలో మార్పులు అనుకూలంగా వచ్చిన తర్వాత బీచ్‌ల్లోకి అనుమతిస్తామని, ఇందుకు పర్యాటకులు, భక్తులు సహకరించాలని కోరారు. కాగా చీరాల వాడరేవు, రామాపురంలో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, డీఎస్పీ ఎండీ మొయిన్ పర్యటించి సముద్ర స్నానాలకు పర్యాటకులకు అనుమతి లేదని తెలిపారు. వీరి వెంట ఫిషరీస్ ఏడీ ఇంకోలు ధనలక్ష్మి, డీపీవో ప్రభాకరరావు, తహసీల్దార్ గోపీకృష్ణ తదితరులు ఉన్నారు.



సూర్యలంక బీచ్‌కు పర్యాటకులు రాకుండా మూసివేసిన గేటు

కూలిన వంతెనలు, చప్టా

- రాకపోకలు బంద్.. ప్రజలు ఇక్కట్లు


వాడరేవు - రామాపురం మార్గంలో కూలిన వంతెన


కెపాల్ గెస్ట్‌హౌస్ సమీపంలో కోతకు గురైన చప్టా

చీరాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ధాటికి వంతెనలు, చప్టాలు ధ్వంసమయ్యాయి. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలకు అవకాశం లేకుండా పోయింది. ద్విచక్ర వాహనాల నుంచి భారీ వాహనాలు పోయేందుకు వీలు లేకుండా వంతెనలు, చప్టాలు కూలిపోయాయి. వాడరేవు జీరో పాయింట్ వద్ద చప్టా సగభాగం కూలి ప్రమాద భరితంగా ఉంది. మిగిలిన మూడు వంతెనలు దారుణంగా కుప్పకూలాయి. దీంతో సుమారు ఐదు రోజుల నుంచి వాడరేవు - రామాపురం గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. మనుగడకు సంబంధించి రాకపోకలు జరగక పోవడంతో వాడరేవు, రామాపురం వాసులు ఇబ్బంది పడుతున్నారు. కూలిన వంతెనలు, చప్టాల మరమ్మతులపై అధికారుల నుంచి స్పందనలేదు. కూలిన వంతెనల సమీపంలో ప్రమాదాలు జరగకుండా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను అడ్డుకుంటున్నారు. ఇక ఈ మార్గంలో 40 వరకు రిసార్ట్స్ ఉన్నాయి. ఇప్పటికే పర్యాటకులు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని ఉన్నారు. అయితే రాకపోకలకు అవకాశం లేకపోవడంతో వారంతా తమ పర్యటనలను రద్దు చేసుకున్నారు. తీరం సాధారణ స్థితికి చేరినా వంతెనల నిర్వహణ లేకపోతే పర్యాటకం ప్రశ్నార్థకంగా మారనున్నది. ఈ నేపథ్యంలో వంతెనలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కొండవీడుకోట ఘాట్‌లో.. విరిగి పడిన కొండచరియలు

యడ్లపాడు, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ప్రముఖ పర్యాటక కేంద్రం కొండవీడు కోట ఘాట్ మార్గంలో కొండ చరియలు ఆదివారం విరిగి పడ్డాయి. దీంతో ఘాట్ మార్గాన్ని అధికారులు మూసివేశారు. రోడ్డుపై బండ రాళ్ల తొలగింపు పనులను అటవీశాఖ అధికారులు చేపట్టారు. జిల్లా అటవీ శాఖాధికారి కృష్ణప్రియ ఈ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొండలపై నుంచి ఉధృతంగా ప్రవహించిన వర్షపు నీటితో పాటు బండరాళ్లు పెద్ద ఎత్తున ఘాట్ మార్గంపైకి జారిపడ్డాయన్నారు. బండరాళ్లను తొలగించే వరకు రాకపోకలను నిషేధించినట్లు వెల్లడించారు. ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా తీసుకున్న చర్యలను పర్యాటకులు అర్థం చేసుకోవాలని కోరారు.

నగరవనంలో.. దొంగలు

- సుందరీకరణ పనుల్లో అక్రమాలు
- అటవీ అధికారుల కనుసన్నల్లోనే అక్రమాలు
- తాజాగా ఏసీబీకి చిక్కిన రేపల్లె రేంజ్ అధికారి

(బాపట్ల,ఆంధ్రజ్యోతి)

దొంగలు దొంగలు కలిసి ఊళ్లు పంచుకున్నట్లుగా బాపట్ల పరిధిలోని నగరవనం సుందరీకరణ పనుల తీరు ఉంది. పనులు అప్పగించడం మొదలుకుని బిల్లులు చెల్లించడం వరకు అడుగడుగునా నిబంధనల ఉల్లంఘనే. కీలకంగా ఉండాల్సిన వనసంరక్షణ కమిటీ (వీఎస్ఎస్)లను కేవలం కాగితాలకే పరిమితం చేసి పనులు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కొంతమంది బినామీలతో అధికారులు పనులు చేయించి సుందరీకరణ నిధులను దోచుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. పట్టణ ప్రాంతాల్లో పర్యావరణ సమతుల్యత కోసం నగరవనాలు ఏర్పాటు చేయాలని 2023లో కేంద్రం నిర్ణయించింది. ఈ క్రమంలో బాపట్ల మండల పరిధిలోని ఆదర్శనగర సమీపంలో అటవీశాఖకు చెందిన భూమిని ఎంపిక చేసి రూ.2 కోట్లతో నగరవనం పేరిట సుందరీకరణ చేపట్టారు. అయితే నగరవనం పనులను వీవీఎస్ కమిటీల ద్వారానే జరగాలి. కానీ పనుల విషయంలో వీఎస్ఎస్‌ల పాత్రను నామమాత్రం చేస్తూ అటవీశాఖ అధికారులు అన్నీ తామై నిధులను దోచేసినట్లు తెలుస్తోంది.

తాజా ఘటనతో అనేక సందేహాలు..

రూ.2 కోట్ల పనులకు సంబంధించి రూ.1.40 కోట్ల పనులను 2024 ఆరంభానికే పూర్తి చేయగా అప్పట్లోనే బిల్లులు మంజూరయ్యాయి. మిగిలిన రూ.60 లక్షల పనులను తాజాగా పూర్తి చేశారు. ఇందుకు సంబంధించి రూ.5.90 లక్షల బిల్లులకు ఆమోదం తెలపడానికి రేపల్లె రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ రమణారావు రూ.1.25 లక్షలు తీసుకుంటుండగానే ఏసీబీ వల పన్ని నగరవనంలోనే అదుపులోకి తీసుకుంది. ఏసీబీకి పట్టించిన కాంట్రాక్టర్ కర్రి వీర్లంకయ్యతో రమణారావుకు ఏళ్ల తరబడి సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఎఫ్ఆర్‌వో వాహనం డ్రైవర్‌గా కూడా సదరు కాంట్రాక్టర్ కొన్ని రోజులు పనిచేశారనేది సమాచారం. వీఎస్ఎస్ తీర్మానాలతో పాటు పనుల పురోగతిలో వారి పర్యవేక్షణ, చివరికి బిల్లుల ఆమోదం, సదరు డబ్బులు కూడా వారి ఖాతాల్లోనే జమ చేయాలనే నిబంధనలు చెబుతున్నాయి. కానీ ఇవేవీ క్షేత్రస్థాయిలో కనబడలేదు. ఈ ఎపిసోడ్‌లో రేంజ్ ఆఫీసర్ పాత్ర కీలకం కాగా అప్పుడు పనిచేసిన కీలక అధికారులకు కూడా ముడుపులు భారీగానే అందినట్లు సమాచారం. అటవీశాఖ కీలక అధికారులకు గతంలో ముడుపులు అందడం వల్లే వీఎస్ఎస్‌లను డమ్మీ చేసి తంతు నడిపించారని సమాచారం. గతంలో కూడా భారీగా అధికారులకు లంచాలు ఇచ్చానని పనులు చేసిన కాంట్రాక్టర్ చెబుతున్నారు. మొత్తం రెండు కోట్ల పనుల్లో దాదాపు రూ.40 లక్షలు పక్కదారి పట్టినట్లు కనబడుతోంది. ఈ నేపథ్యంలో సమగ్ర విచారణ జరిపితే విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

కమనీయం.. సహస్ర దీపాలంకరణ


దేవాలయ ప్రాంగణంలో మహిళలు వెలిగించిన కార్తీక దీపాలు

బాపట్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని చీలురోడ్డు సెంటర్‌లోని శ్రీరుక్మిణీ సమేత పాండురంగాస్వామి దేవాలయంలో ఆదివారం రాత్రి సహస్రదీపాలంకరణ సేవ జరిగింది. భక్తిశ్రద్ధలతో పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గంటా సాయిబాబు, కృష్ణకుమారి దంపతులు దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించగా ఆ వెలుగుల్లో ఆలయం వెలుగులీనింది. ఆ దృశ్యాన్ని తిలకించిన భక్తులు భక్తి పారవశ్యం పొందారు. అనంతరం పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త మార్చూరి బద్రినారాయణ, అర్చకులు మేడూరి వెంకటఅప్పలచార్యులు, రొంపిచర్ల కేశవాచార్యులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకూ.. ఆటలు

- 22 నుంచి డివిజన్ స్థాయిలో పోటీలు
- సన్నాహాలు చేస్తున్న పాఠశాల విద్యాశాఖ

రేపల్లె, నవంబరు 2 (ఆంధ్ర జ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాలు గుర్తించి వారిని ప్రోత్సహించి భావిపౌరులుగా తీర్చిదిద్దడంలో కీలక భూమిక పోషించే ఉపాధ్యాయుల్లో మానసిక ఒత్తిడిని దూరం చేసేలా.. మరింత ఉత్సాహంగా బోధన చేసేలా.. శారీరక, మానసిక సామర్థ్యం పెరిగేలా.. ప్రభుత్వం ఆటల పోటీలు నిర్వహించేందుకు సిద్ధమైంది. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఆటల పోటీల నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్ పాఠశాలలో దాదాపు 18 వేల మందికిపైగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఉపాధ్యాయుల్లో కూడా అంతర్లీనంగా ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. క్రికెట్, త్రో బాల్, కబడ్డీ, క్యారమ్స్, షటిల్ తదితర పోటీలు తొలుత మండల స్థాయిలో నిర్వహించనున్నారు. ఆ తర్వాత డివిజన్ స్థాయిలో నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తుంది. ఈ బాధ్యతలను మండల స్థాయిలో స్పోర్ట్స్ కోఆర్డినేటర్స్‌కు అప్పగించారు. మండలస్థాయిలో ఎంఈఓ 1, 2 నిర్వహణ అధికారులుగా వ్యవహరిస్తారు. డివిజన్ స్థాయిలో డిప్యూటీ డీఈవో, జిల్లా స్థాయిలో డీఈవో స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి సమన్వయకర్తలుగా ఉంటారు. రాష్ట్ర స్థాయిలో పోటీలకు స్కూల్ గేమ్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి, జేడీ స్థాయి అధికారి బాధ్యతలు తీసుకుంటారు. పోటీలకు తొలుత మండల స్థాయిలో జట్ల ఎంపికను చేస్తారు. ఉపాధ్యాయులకు సంబంధించి క్రికెట్ పోటీలకు సంబంధించి ఎంఈఓ, ప్రధానోపాధ్యాయుడు, ముగ్గురు, పాఠశాల సహాయకులు, నాన్ లాంగ్వేజ్ ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్, పీఈటీలు, ఏడుగురు ఎస్జీటీల సహా మొత్తం 16 మందితో కమిటీ ఏర్పాటు చేస్తారు. అదేవిధంగా త్రోబాల్ ఇతర క్రీడలకు ప్రత్యేకంగా జట్ల ఎంపిక నిర్వహిస్తారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి డీఈఓ లకు ఆదేశాలు జారీ అయ్యాయి.

షెడ్యూల్ ఇలా...

- డివిజన్ స్థాయి : 22, 23 తేదీల్లో
- జిల్లాస్థాయి :, 28, 29, 30 తేదీల్లో
- రాష్ట్రస్థాయి : డిసెంబరు 6, 7, 13, 14

అవీ..ఇవీ..

భక్తిశ్రద్ధలతో కార్తీక వనభోజనాలు


వనభోజనాలు చేస్తున్న ఆర్యవైశ్యులు

పంగులూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు గ్రామంలో ఆర్యవైశ్య కార్తీక వన భోజన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో ఆర్యవైశ్యులతో పాటు అయ్యప్ప స్వాములు ఈ వనభోజన కార్యక్రమంలో పాల్గొన్నారని ఆర్యవైశ్య ప్రతినిధి పల్లపోతు శ్యామ్సుందర్ తెలిపారు.

సముద్ర స్నానాలు నిషేధం : కలెక్టర్

పర్చూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నేటి కార్తీక సోమవారం నుంచి పౌర్ణమి రోజు వరకు సముద్ర స్నానాలకు ప్రభుత్వం నిషేధించింది. ఆ మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కార్తీక మాసంలో సముద్ర స్నానాలు చేస్తే సర్వదోషాలు వీడి సుఖశాంతులుంటాయన్న నమ్మకంతో ఏటా భక్తులు సముద్ర స్నానానికి వెళుతుంటారు. అయితే తుఫాను ప్రభావంతో సముద్రంలో భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉండడంతో భక్తులు, పర్యాటకుల భద్రత నేపథ్యంలో అధికారులు అనుమతికి నిరాకరించారు.

తీర ప్రాంతాలు మూసివేత

చినగంజాం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మోటుపల్లి, బాపయ్యనగర్, పల్లెపాలెం సముద్ర తీరప్రాంతాలను మూసివేసినట్లు చినగంజాం ఎస్ఐ శీలం రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొంథా తుఫాన్ ప్రభావంతో సముద్ర తీర ప్రాంతం తీవ్రంగా దెబ్బతిని ప్రమాదకర పరిస్థితులు ఉన్నందున పర్యాటకులకు, సోమవారం కార్తీక పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు తీరప్రాంతాల్లో అనుమతి లేదన్నారు. సాధారణమైన అనుకూల పరిస్థితులు ఏర్పడిన అనంతరం సముద్ర తీరప్రాంతాలకు అనుమతి ఇవ్వనున్నట్లు ఎస్.ఐ తెలిపారు.

తీరంలో కార్తీక స్నానాలకు అనుమతి లేదు

ఇంకొల్లు, నవంబరు 2,(ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో సముద్రతీర ప్రాంతాలు కోతకు గురైనందున ఈ నెల 3, 4, 5 తేదీలలో కార్తీక స్నానాలు చేసేందుకు అనుమతి లేదని ఇంకొల్లు సీఐ వై.వి రమణయ్య తెలిపారు. బీచ్ మూసివేసినట్లు తెలిపారు.

'పౌర్ణమి సాగర హారతి'కి ఏర్పాట్లు

● ఓంకేశ్వర్ నుండి నర్మదా మరకతభానులింగం


పూజల్లో పాల్గొన్న భక్తులు

కొత్తపేట(చీరాల), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు తీరంలో బుధవారం పౌర్ణమి సాగర హారతి నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు డా. తాడివలస దేవరాజ్ చెప్పారు. ఇటీవల ఓంకేశ్వర్ నుంచి నర్మదా మరకత భానులింగాన్ని తీసుకువచ్చారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్ సహకారంతో ఉజ్జయిని శ్రీ మహాకాళేశ్వర ఆలయంలో శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కొత్తపేట ఓంకారేశ్వర ఆలయంలో పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాగర హారతికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్ గుప్తా, హిందూ చైతన్య వేదిక సభ్యులు డా.శబరి, బుర్ల సాంబశివరావు, సురేష్, మురళీ, మల్లికార్జున్రావు, సతీష్ పాల్గొన్నారు.

5న శింగరకొండ గిరి ప్రదక్షిణ

అద్దంకి, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం శింగరకొండలో గిరి ప్రదక్షిణ నిర్వహించనున్నట్లు లక్ష్మీనరశింహస్వామి దేవస్థానం ఛైర్మన్ గుంజి శ్రీనివాసరావు, ఈవో మద్దినేని శ్రీనివాసరావులు తెలిపారు. ఉదయం 6:30 గంటలకు గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందన్నారు. 6:30 గంటలకు ఉసిరిచెట్టు పూజా కార్యక్రమం జరుగుతుందని భక్తులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి


దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అద్దంకి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 417 జయంతి మహోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలోని కాకానిపాలెం వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాతసేవ, గణపతిసేవ, కంకణాధారణ, అభిషేకము, అఖండజ్యోతి ప్రజ్వలన, మహానివేదన నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలలో దేవస్థానం కమిటీ అధ్యక్షుడు పొన్నపల్లి బ్రహ్మానందం, వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నుపల్లి శ్రీనివాసాచారి, జాగర్లమూడి శ్రీనివాసరావు, మిద్దెబోయిన ఆంజనేయరాజు, టీడీపీ అద్దంకి క్లస్టర్ ఇన్చార్జ్ కాకాని అశోక్, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, ఉండవల్లి కృష్ణారావు, కనపర్తి రమ్యకృష్ణ, వెంకటనారాయణమ్మ గోపి, సందిరెడ్డి శ్రీనివాసరావు, కొండ్రగుంట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో పూజలు

మార్టూరు : పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి సందర్భంగా ఆదివారం మండల పరిధిలోని బొబ్బేపల్లి దండుదారి వద్ద వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవిందమాంబ సమేత వీర బ్రహ్మేంద్రస్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. తరువాత భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

చోరీ కేసులో 10 మంది మహిళలు అరెస్ట్

చీరాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : చోరీ కేసులో పది మంది మహిళలను చీరాల వన్టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం పట్టణంలోని వన్గ్రామ్ గోల్డ్ దుకాణంలో సుమారు రూ.55 వేలు విలువైన వన్గ్రామ్ గోల్డ్ అపహరించారు. ఈ మేరకు నమోదైన కేసులో రామ్నగర్, ఆదినారాయణపురం ప్రాంతాలకు చెందిన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు.

రాకపోకలకు నేటికీ తప్పని ఇక్కట్లు

- పలు గ్రామాల్లో దెబ్బతిన్న వంతెనలు
- నల్లవాగుపై ప్రమాదకరంగా బ్రిడ్జీ
- మోదేపల్లి వద్ద తెగిపోయిన వైనం
- మూడు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- లోతట్టు ప్రాంతాలను నేటికీ వదలని వరదనీరు
- అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం


మోదేపల్లి వద్ద కోసుకుపోయిన ఆర్అండ్బీ రోడ్డు

అద్దంకి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిత్యం వందల వాహనాలు ప్రయాణించే అద్దంకి-రేణింగవరం రోడ్డులో నల్లవాగుపై ఉన్న కల్వర్టు వద్ద ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల కురిసిన మొంథా తుఫాన్ ప్రభావంతో నల్లవాగుకు వరద ప్రవాహం పెరిగింది. కల్వర్టు సపోర్ట్ వాల్ కోసుకుపోయింది. అసలే శిథిలావస్థకు చేరిన కల్వర్టు వరదతో మరింత బలహీన పడింది. కల్వర్టు ఇరుకుగా ఉండడంతో వాహనాలు ఎదురెదురు వచ్చిన సమయంలో ప్రమాదం జరిగే అవకాశం ఉందని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. అద్దంకి నుంచి రేణింగవరం వరకు డబుల్ రోడ్డుగా మార్చినప్పటికి నల్లవాగు కల్వర్టు మాత్రం చిన్నదిగా ఉంది. జార్లపాలెం, కశ్యాపురంల వద్ద ఉన్న కల్వర్టులు కూడా దెబ్బతిన్నాయి. వర్షాల సమయంలో రాకపోకలు నిలిచిపోతున్నాయి. వాహనాల రాకపోకలు పెరిగినందున మూడు వాగులపై వంతెనల నిర్మాణం చేపట్టాలని వాహనచోదకులు, ప్రజలు కోరుతున్నారు.

బల్లికురవ : తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో రహదారులపై వర్షంనీరు వీడలేదు. గ్రామాలలో దీంతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. మండలంలోని కొప్పెరపాడు గ్రామంలోని ఉన్నత పాఠశాల పక్కన ఉన్న వీధిలో వారం రోజుల నుంచి వర్షపు నీరు పెద్ద ఎత్తున నిలిచి ఉంది. ఈ నీరు వెళ్లే కాలువలు లేకపోవడంతో అలానే ఉంది. ప్రజలు నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. కాలువలు లేకపోవడంతో ఈ నీరు అలానే పాచిపట్టిందని ప్రజలు వాపోతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా, రోడ్లపై నీరు నిలుస్తోందని, విద్యార్థులు సైతం పాఠశాలకు రావాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. అధికారులు వెంటనే వర్షపు నీరు ముందుకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పంగులూరు : పంగులూరు ఇసుకవాగులో నేల చప్టాపై గుంతలను పూడ్చేందుకు ఉపయోగించిన బంకమట్టితో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మొంథా తుఫాన్ కారణంగా వరద తాకిడికి పంగులూరు నుంచి తక్కెళ్లపాడు వెళ్లే రోడ్డులోని నల్లవాగు చప్టాపై భారీ గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతులు పూడ్చేందుకు నల్లటి బంకమట్టిని వినియోగించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అద్దంకి : మండల కేంద్రమైన అద్దంకితో మండలంలోని మూడు గ్రామాలకు రాకపోకలు నేటికీ ప్రారంభం కాలేదు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టిన మరో వారం పడుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. తిమ్మాయపాలెం-ఇలపావులూరు ఆర్అండ్బీ రోడ్డులో మోదేపల్లి వద్ద చిలకలేరు వాగు ఉధృతికి రోడ్డు కోసుకుపోయింది. అదే సమయంలో పేరాయపాలెం వద్ద ధోర్నపువాగుపై ఉన్న వంతెన కొట్టుకుపోయింది. దీంతో మండలంలోని పేరాయపాలెం,, దేనువకొండ, ఉమ్మనేనివారిపాలెంల నుంచి అద్దంకికి రాకపోకలు నిలిచిపోయాయి. తాళ్లూరు, వెల్లంపల్లి మీదుగా అద్దంకి చేరుకోవాల్సి వస్తోంది. అదే సమయంలో తాళ్లూరు, చీమకుర్తి, మద్దిపాడు మండలాలలోని పలు గ్రామాల నుంచి కూడా అద్దంకికి వచ్చే అవకాశం లేకుండా పోయింది. అద్దంకి నుంచి తాళ్లూరు, గంగవరం, బొద్దికూరపాడులకు నడిచే ఆర్టీసీ బస్సులను నిలిపివేశారు. తాత్కాలిక మరమ్మతులు వెంటనే పూర్తి చేసి రాకపోకలు పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బంకమట్టితో మరమ్మతులు

● వాహనచోదకులకు ఇక్కట్లు

పంగులూరు: పంగులూరు ఇసుకవాగులో నేలచప్టాపై గుంటలు పూడ్చేందుకు ఉపయోగించిన బంకమట్టితో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మొంథా తుఫాన్ కారణంగా వరద తాకిడికి పంగులూరు నుంచి తక్కెళ్లపాడు వెళ్లే రోడ్డులోని నల్లవాగు చప్టాపై భారీ గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతులను పూడ్చేందుకు బంకమట్టిని వినియోగించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొమర్నేనివారిపాలెం(పర్చూరు) : మొంథా తుఫాను ప్రభావంతో రోడ్లు దెబ్బతిని రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గ్రామాల్లో ఎక్కడ చూసినా, కాలువలు, వాగులకు గండ్లు పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో ఆయా మార్గాల నుంచి ప్రజలు రాకపోకలు సాగించేందుకు నానా అగచాట్లు పడాల్సిన పరిస్థితి. దీంతో గ్రామ పంచాయితీ, స్థానిక నేతల సారథ్యంలో ప్రత్యేక ఎక్సకవేటర్ను ఏర్పాటు చేసుకొని దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో రోడ్ల మరమ్మతులు శరవేగంగా సాగుతున్నాయి.


బల్లికురవ మండలం కొప్పెరపాడు వద్ద నిలిచిన వర్షపునీరు, పంగులూరు ఇసుకవాగులో నేలచప్టాపై గుంతలలో తేలిన బంకమట్టి, అద్దంకి మండలం నల్లవాగుపై ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి

పెత్తనం వద్దు...ప్రజా సేవే ముద్దు : ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో సమస్యల్లో ఉన్న ప్రజలకు అండదండలు అందిద్దామని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. శనివారం సీఎం చేతుల మీదుగా ఉత్తమసేవా పురస్కారం అందుకున్న ఎమ్మెల్యే ఆదివారం నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావుతో కలిసి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ప్రశంసా పత్రాన్ని అందుకున్న ఎమ్మెల్యేకు పెద్ద సంఖ్యలో పుష్పగుచ్చాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనతోపాటు అధికారులు కూడా నిత్యం అందుబాటులో ఉండి సేవలందించినట్లు తెలిపారు. స్థానిక నేత సిద్ధి బుచ్చేశ్వరరావు, మరి కొందరుకు పునరావాస కేంద్రాలలో ఆహారం, ఇతర వసతులు సమకూర్చడంతో సహకరించినట్లు తెలిపారు. అలాగే అధికారులను ఇబ్బందులకు గురి చేసిన కొన్ని ప్రాంతాలను గుర్తు చేశారు. ఒక్కో నేత నుంచి ఆయా గ్రామాలలో ప్రస్తుతం ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సంస్థలు ఎన్నికల్లో పార్టీ జెండా ఎగిరేలా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గడియార స్తంభం ఏర్పాటుకు కృషి చేయండి

చీరాల : చారిత్రాత్మక కట్టడం గడియార స్తంభం పునఃనిర్మాణానికి కృషి చేయాలని సాధన సమితి ప్రతినిధులు ఎమ్మెల్యే కొండయ్యను కోరారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గడియార స్తంభం ప్రాధాన్యతను వివరించారు. చీరాల ప్రజల కల గడియార స్థంభం ఏర్పాటని, కూటమి ప్రభుత్వం హయాంలో నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు అక్కిశెట్టి పుల్లయ్య నాయుడు, సర్విశెట్టి సుబ్బరామయ్య, వడ్లమూడి ఆదినారాయణ, మెట్టా నరసయ్య, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, రాజు, పులి నారాయణ, ఇజ్రాయేల్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆచూకీ గుర్తింపు

● తహసీల్దార్ ఎదుట హాజరు పరిచిన సీఐ

అద్దంకి,అక్టోబరు2(ఆంధ్రజ్యోతి): హాస్టల్ నుంచి పరారైన విద్యార్థులను పోలీసులు గుర్తించి డీటీ వద్ద ఆదివారం హాజరుపరిచారు. సీఐ సుబ్బరాజు కథనం మేరకు కాకానిపాలెం హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు శనివారం ఉదయం హాస్టల్ నుండి బయటకు వెళ్లారు. పాఠశాలకు వెళ్లకుండా పరారయ్యారు. సాయంత్రం సమయానికి కూడా విద్యార్థులు హాస్టల్కు రాకపోవడంతో వార్డెన్ వీరాస్వామి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ధనుష్, సుబ్బారెడ్డి మరో నలుగురు విద్యార్థులు శుక్రవారం రాత్రి బహిర్భూమికని బయటకు వెళ్లి హాస్టల్కు రావడం ఆలస్యం చేశారు. దీంతో సిబ్బంది వారి తల్లిదండ్రులకు తెలియజేశారు. ఫోన్లో విద్యార్థులను తల్లిదండ్రులు మందలించారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం పాఠశాలకని చెప్పి నేరుగా ఒంగోలు వెళ్లారు. అక్కడ నుండి ట్రైన్లో విజయవాడ వెళ్లి రాత్రి కి తిరిగి మరలా ఒంగోలు వచ్చారు. ఆదివారం ఉదయానికి మేదరమెట్ల చేరుకున్నారు. సమాచారం అందుకున్న సీఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో 6 బృందాలు ఏర్పాటు చేసి అద్దంకి,ఒంగోలు, చిలకలూరిపేట,మార్టూరు,మేదరమెట్ల తదితర ప్రాంతాలలో వెతుకుతూ సీసీ ఫుటేజ్ పరిశీలించారు. ఈ క్రమంలో మేదరమెట్ల లో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు ఇద్దరు విద్యార్థులు తీసుకొని వచ్చి ఆదివారం డీటీ సురేష్బాబు వద్ద హాజరుపరిచారు. అనంతరం తల్లిదండ్రులకు విద్యార్థులను అప్పగించారు. దీంతో ఇద్దరు విద్యార్థుల అదృశ్యం కథ సుఖాంతమైంది. ఆరుగురు విద్యార్థులు చెడు వ్యసనాలకు లోనుకావడంతో గతంలో పలుమార్లు హాస్టల్ సిబ్బంది తల్లిదండ్రుల దృష్టికి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది.

డ్రోన్ ద్వారా వరద ప్రవాహం సర్వే



చినగంజాం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : చినగంజాం, పెదగంజాం ప్రాంతాల్లో వరద ప్రవాహన్ని, రొంపేరు, కొమ్మమూరు కాలువల్లో, పొలాలలను డ్రోన్ల ద్వారా ఆదివారం సర్వే చేసినట్లు మండల ప్రత్యేకాధికారి సీహెచ్. ప్రశాంత్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముంపు ప్రాంతాలను డ్రోన్ ద్వారా సర్వే చేస్తున్నట్లు తెలిపారు. కాలువల్లో ప్రవహించే వరదనీరుకు ఏమైనా అడ్డంకులు ఉన్నాయా..? అని చూసి త్వరగా వరద నీరు బయటకు పోయేందుకు సర్వే చేస్తున్నన్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, ఏవో ఆర్.చంద్రశేఖర్, మండల సర్వేయర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు నిత్యావసరాల పంపిణీ


నిత్యావసరాలను అందజేస్తున్న వెంకటేశ్వరరెడ్డి

చినగంజాం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మున్నంవారిపాలెం, కొత్తపాలెం గ్రామాల్లోని మొంథా తుఫాన్ బాధితులకు టీడీపీ నాయకులు నిత్యావసర వస్తువులను ఆదివారం పంపిణీ చేశారు. పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు బాధితులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేసినట్లు మున్నంవారిపాలెం టీడీపీ నాయకులు కుక్కల వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. మున్నంవారిపాలెం పంచాయతీ పరిధిలోని రాజమాతకాలనీలోని తుఫాన్ కారణంగా వరద వచ్చి ఇల్లు మునిగిన బాధితులకు, కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని తుఫాన్ బాధితులకు 25 కేజీల బియ్యం, పంచదార 1 కేజీ, కందిపప్పు ఒక కేజీ, నూనె కేజీ, ఆలుగడ్డలు కేజీ, ఉల్లిపాయలు ఒక కేజీ చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల టీడీపీ నాయకులు కోకి శ్రీనివాసరెడ్డి, పొగర్త నాగరాజు, కత్తుల శ్రీను, పల్లపట్ల శ్రీనివాసరెడ్డి, ఎం.నాగాంజిరెడ్డి, రాజు ఉదయ్భాస్కరరెడ్డి, చేజర్ల రమణ, పత్తిపాటి నాగేశ్వరరావు, తెడ్డు శ్రీనివాసరెడ్డిలు పాల్గొన్నారు.

చందుకు సేవారత్న అవార్డు


పృథ్వీ చేతులమీదగా అవార్డును అందుకుంటున్న చందు

మార్టూరు, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): విశ్వజనని నరసరావుపేట వారు మార్టూరులో అమ్మ ఆశ్రమం అధ్యక్షులు గుంటుపల్లి చందును విశ్వ జనని సేవారత్నం అవార్డును బహూకరించారు. జ్ఞాపికను అందజేసి సత్కరించారు. తమఫౌండేషన్ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం రాత్రి హైదరాబాదు నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ కళా నిలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సినీ నటులు పృథ్వీ చేతుల మీదగా చందుకు అవార్డును అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ బొగ్గారపు బ్రహ్మానందం, సినీ నటులు గౌతమ్, రాజు తదితర సినీ, రాజకీయనాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు


చికిత్స పొందుతున్న మధు, అన్నపూర్ణ

అద్దంకి, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): మోటార్సైకిల్పై రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి వచ్చిన బొలేరో వాహనం ఢీ కొని భార్యాభర్తలకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు పట్టణంలోని భవానిసెంటర్కు చెందిన మధు, అపర్ణలు మున్సిపల్ కార్యాలయం సమీపంలో టిఫిన్ హోటల్ నిర్వహించుకుంటున్నారు. ఆదివారం ఉదయం ఇంటి వద్ద నుండి హోటల్ వద్దకు మోటార్సైకిల్ పై మున్సిపల్ కార్యాలయం రోడ్డులోకి పాతబస్టాండ్ వద్ద మలుపు తిరుగుతుండగా వెనుక నుండి వచ్చిన బొలేరో వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మధు, అపర్ణలకు గాయాలయ్యాయి. స్థానికుల వెంటనే క్షతగాత్రులను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

అద్దంకి, నవంబరు2(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్తో పంటలు నష్ట పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైసీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని శంఖవరప్పాడులో ఆయన ఆదివారం దెబ్బతిన్న మొక్క జొన్న పొలాలను పరిశీలించారు. వైసీపీ నేతలు జ్యోతి హనుమంతరావు, కాకాని రాధాకృష్ణమూర్తి, ఈదా శ్రీనివాసరెడ్డి, అవిశన ప్రభాకరరెడ్డి, మాకినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

మేదరమెట్ల, నవంబరు2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మనపాలెం గ్రోత్ సెంటర్ వద్ద ముందు వెళుతున్న మోపెడ్ను వెనుక నుంచి వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొనడంతో మోపెడ్పై వెళుతున్న దంపతులతో పాటు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వ్యక్తికి కూడా గాయాలయ్యాయి. ఆదివారం ఎర్రబాలెం గ్రామానికి చెందిన మొరవినేని శేషగిరిరావు, ఆయన భార్య హైదరాబాద్ నుంచి బస్సు దిగారు. స్వగ్రామం ఎర్రబాలెంకు టీవీఎస్ మోపెడ్పై బయలుదేరారు. గ్రోత్సెంటర్ వద్ద యూటర్న్ తీసుకొని వెళుతున్న వీరి వాహనాన్ని ఒంగోలు వైపు నుంచి వస్తున్న మోటారు సైకిల్ ఢీకొన్నది. దీంతో భార్యాభర్తలు రోడ్డుపై పడి గాయపడ్డారు. ఒంగోలు వైపు నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన ఈశ్వర్ అనే వ్యక్తి కూడా గాయపడ్డారు. ఈశ్వర్ మద్యం సేవించి అతివేగంగా వాహనం నడపడంతో వేగం అదుపుకాక ముందు వెళుతున్న టీవీఎస్ మోపెడ్ను ఢీకొన్నాడని పోలీసులు తెలిపారు. గాయపడిన వీరిని హైవే అంబులెన్స్లో వైద్యశాలకు తరలించారు.

ఆక్రమణలో.. ఆనవాళ్లు

(5వ పేజీ తరువాయి)


ఉండేది. ఆలయ నిర్వహణలో పాలు పంచుకునే వారిని కశ్మీర్, తమిళనాడు నుంచి విశ్వేశ్వరశంభు ప్రత్యేకంగా తీసుకొచ్చారు. ఇలా శివాలయం అప్పట్లో ఒక వెలుగు వెలిగింది. ఇది నేడు గర్భాలయం వరకే పరిమితమై కనిపిస్తున్నది.

ఆక్రమణల మధ్య ఆనవాళ్లు మాయం..

కాకతీయుల అనంతరం జరిగిన ముస్లింల దాడుల నేపథ్యంలో గోళకీమఠం దెబ్బతింది. ఆలయ మండపాలతో పాటు గర్భగుడిలోని శివలింగాన్ని కూడా ధ్వంసం చేశారు. ఆ తర్వాత అగ్రహారంగా ఉన్న ఈ ప్రాంతమంతా కాలగతిలో ఆక్రమణల పాలైంది. ఆలయం, రుద్రమదేవి శిలాశాసనం కూడా కనిపించనంతగా గృహాలు పుట్టుకొచ్చాయి. ఆలయానికి దక్షిణంగా 20 సెంట్లు, పడమరగా 16 సెంట్లు మాత్రమే మిగిలి ఉంది. ఆలయాన్ని రాష్ట్ర దేవదాయశాఖ పరిధిలోకి తీసుకుని అభివృద్ధి చేయాలని కోరుతూ గ్రామస్థులు ప్రభుత్వానికి అర్జీల రూపంలో విన్నవించుకున్నారు. డాక్టర్ భవానీ అనే డాక్టర్ ఇటీవల ఈ ఆలయ చరిత్రను తెలుసుకుని తన బంధుమిత్రుల సహకారంతో ఆలయ పునర్నిర్మాణం చేస్తానని ముందుకొచ్చారు. అయితే ఆలయం చుట్టూ వున్న 33 గృహాలవారు అందుకు అభ్యంతరాలను వ్యక్తం చేయడంతో ఆమె ఏమీ చేయలేక నిస్సహాయిరాలిగా ఉండిపోయారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2018లో ఈ ఆలయాన్ని సందర్శించారు. అయినా అభివృద్ధిలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. మందడం-తుళ్లూరు ఆర్అండ్బీ రోడ్డు వెంబడి ఉన్న రుద్రమదేవి నిర్మించిన చెరువు కూడా మూడువైపులా ఆక్రమణలు పెరిగిపోయాయి.

2011 నుంచే మళ్లీ పూజాదికాలు

గోళకీమఠం స్ఫూర్తితో విజయవాడకు చెందిన శివస్వామి మందడం శివారులోని కృష్ణానది వెంట తాళ్లాయపాలెంలో శైవక్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. మల్కాపురంలో అరకొర గోడలతో సజీవశిలాజం మాదిరి మిగిలి ఉన్న గర్భగుడిలో 2011 చిన్న శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలు జరిగేలా ఏర్పాటు చేశారు. ఇందుకు ఆలయం ఎదురుగా ఉన్న షేక్ అరుణ అనే మహిళ ఆర్థికసహకారాన్ని అందించారు. ములకల ఆదినారాయణ అనే పూజారి గత ఏడాదిగా స్వచ్ఛందంగా ఆలయంలో పూజాదికాలను నిర్వహిస్తున్నారు.



పాఠశాల నుంచి ఆ ముగ్గురు మిత్రులు. ఇంటర్‌లో వేర్వేరు కాలేజీల్లో చేరినా సెలవు రోజుల్లో మాత్రం ఆ ముగ్గురూ కలిసి సరదాగా గడిపేవారు. అయితే, వీరి స్నేహాన్ని చూసి మృత్యువుకు కన్నుకుట్టిందో ఏమోగానీ ముగ్గురినీ అలల రూపంలో వచ్చి కబళించింది. ఇందుకూరుపేట మండలం మైపాడ్ బీచ్‌లో ఆదివారం మధ్యాహ్నం కడలిలో ఈతకు దిగిన ముగ్గురు ఇంటర్ విద్యార్థులు గల్లంతు అయి, విగతజీవులుగా బయటపడ్డారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, స్నేహితులు జీజీహెచ్‌లోని మార్చురీ వద్దకు చేరుకుని గుండెలవిసేలా విలపించారు.



అంబులెన్స్‌లో ఉన్న మృతదేహాలను చూస్తున్న బంధువులు, స్నేహితులు



ఇందుకూరుపేట: మైపాడు తీరంలో యువకుల మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

కన్నపేగులో అలజడి!

- మైపాడు బీచ్‌లో ముగ్గురు స్నేహితుల గల్లంతు
- కొద్దిసేపటికే మృతదేహాల వెలికితీత
- ముగ్గురూ ఇంటర్ విద్యార్థులే!
- కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యులు

ఇందుకూరుపేట/నెల్లూరు(క్రైం)/నెల్లూరు రూరల్ నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) :నెల్లూరులోని జెండావీధికి చెందిన పఠాన్ రహమత్, షమీల కుటుంబం ఆరు మాసాల క్రితం షమీల సొంతూరైన నెల్లూరురూరల్‌లోని నారాయణరెడ్డిపేటకు వచ్చారు. అద్దె ఇంట్లో ఉంటున్న రహమత్ నెల్లూరులోని ఓ బంగారు దుకాణంలో పనులు చేస్తున్నారు. ఈయనకు ఇద్దరు కుమారులు కాగా, పెద్దకుమారుడు పఠాన్ తాజీమ్ (17) అరవిందనగర్‌లోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అలాగే, కోటమిట్ట ప్రాంతంలో నాయబ్‌రసూల్, మున్నీ దంపతుల కుమారుడు పఠాన్ హుమయూన్ (17) కూడా నారాయణ కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నారు.

● కోటమిట్ట ప్రాంతానికి చెందిన బాబు, జబీన్ దంపతుల కుమారుడు సమీద్ (17). సమీద్ తండ్రి చిన్నతనంలోనే మృతి చెందడంతో తల్లి జబీన్ ఎంతో కష్టపడి తన ఇద్దరు కుమారులను పెంచింది. ఈ క్రమంలో సమీద్ నగరంలోని కృష్ణచైతన్య కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ ముగ్గురు నగరంలోని కోటమిట్టలో ఉన్న సిటీజన్ పాఠశాలలో 8 నుంచి పదవ తరగతి వరకు కలిసి చదువుకున్నారు.

● అలలధాటికి గల్లంతు

ఆదివారం సెలవు రోజు కావడంతో మధ్యాహ్నం ముగ్గురూ మైపాడు బీచ్‌కు వెళ్లారు. అక్కడ నీటిలో ఆడుకుంటుండగా ఒక్కసారిగా అలలధాటికి గల్లంతు అయ్యారు. అక్కడే ఉన్న వారు కేకలు వేయడంతో మెరైన్ పోలీసులు రంగంలోకి దిగి గాలించారు. 3 గంటల ప్రాంతంలో ఆ ముగ్గురి మృతదేహాలను వెలికి తీశారు. వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్ల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్‌ఐ నాగార్జునరెడ్డి ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



సమీద్



తాజీమ్



హుమయూన్

ఇప్పుడే వస్తామని చెప్పి..

పఠాన్ తాజీమ్, పఠాన్ హుమయూన్, సమీద్‌లు ఇప్పుడే వస్తామని కుటుంబ సభ్యులకు చెప్పి ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చారు. నగరం నుంచి మైపాడ్ బీచ్‌కు కలిసి వెళ్లారు. మధ్యాహ్న మైనా పిల్లలు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు వారికి ఫోన్లు చేశారు. వారు ఫోన్‌లు తీయకపోవ డంతో కుటుంబసభ్యులు కంగారుపడ్డారు. కొద్దిసేపటికే పోలీసులు ఫోన్ చేసి మైపాడు బీచ్‌లో మీ పిల్లలు మృతి చెందారని చెప్పడంతో కన్నపేగు తల్లడిల్లిపోయింది. జీజీహెచ్ మార్చురీ వద్దకు మృతదేహాల ను తీసుకువస్తున్నట్లు తెలపడంతో తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు పరుగున అక్కడకు చేరుకున్నారు. అంబులెన్స్‌లో మృతదేహాలను చూసి కన్నీరుమున్నీరయ్యారు. తజీమ్ లేవరా.. నాన్న!! అంటూ మృతదేహంపై పడి తల్లిదండ్రులు రోదించారు.

సముద్రంలో వేటకు వెళ్లి..



కావలి రూరల్ : సముద్రంలో వేటకు వెళ్లి ఓ మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన ఆదివారం కావలి మండలం తుమ్మలపెంటలో జరిగింది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. తుమ్మలపెంట పంచాయ తీ పెదరాముడుపాలెంకు చెందిన కాటంగారి బ్రహ్మయ్య (34) శనివారం రాత్రి గ్రామస్థులతో కలిసి జువ్వలదిన్నె హార్బర్ నుంచి బోటులో చేపలు పట్టేం దుకు వెళ్లాడు. తుమ్మలపెంట సమీపంలో చేపలు పడుతూ ఆదివారం ఉదయం ప్రమాదవశాత్తు బోటులో నుంచి కిందపడి గల్లంతయ్యాడు. పెదరాము డుపాలెం సముద్రతీరానికి కొట్టుకువచ్చిన బ్రహ్మయ్య మృతదేహాన్ని రూరల్, మెరైన్ ఎస్‌ఐలు తిరుమలరెడ్డి, జానకిరామయ్యలు పరిశీలించారు. మృతుడికి భార్య గాయత్రి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య గాయత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తిరుమల రెడ్డి తెలిపారు.

ఆత్మకూరు చెరువులో యువకుడు..



● పోలీస్, ఫైర్ సిబ్బంది ముమ్మర గాలింపు

ఆత్మకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు పట్టణ సమీపంలోని చెరువులో ఆదివారం సాయంత్రం నలిశెట్టి మహేష్ (30) అనే యువకుడు గల్లంతు అయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. చెరువులో ఈతకు దిగిన మహేష్ కొద్దిసేపటికే నీట మునిగి గల్లంతయ్యాడు. తాను ఈత కొట్టలేకపోతున్నానని, రక్షించమని కేకలు వేయడంతో సమీపంలో ఉన్న అయ్యప్పభక్తులు రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. సమాచారం అందుకున్న సీఐ గంగాధర్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో హుటాహుటిన చెరువు వద్దకు చేరుకున్నారు. చెరువు మొత్తం జల్లెడ పట్టినా మహేష్ ఆచూకీ తెలియరాలేదు. ఆత్మకూరులో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న మహేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రేషన్ మాఫియాకు చెక్ పడేనా!?

- పేదల బియ్యం పక్కదారి పట్టడంపై ప్రభుత్వం సీరియస్
- సివిల్ సప్లయిస్ అధికారులపై చర్యలు
- మాఫియా డాన్లపైనా చర్యలకు సన్నద్ధం
- రేషన్ అక్రమాలను ముందే వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'
- నాడు పట్టించుకోని అధికార యంత్రాంగం

నెల్లూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రూ.20లకు కొనుగోలు.. రూ.50లకు అమ్మకంగా జరుగుతున్న రేషన్ మాఫియా దందాకు ఇకనైనా చెక్ పడుతుందా!? ఇప్పటివరకూ అధికారుల అండతో చెలరేగిపోయిన అక్రమార్కులకు ఇప్పుడు ఆ అధికారులపై చర్యలతోనైనా బ్రేకులు పడతాయా..? అన్నది జిల్లాలో ప్రధాన చర్చగా నడుస్తోంది. ప్రతీ నెలా పేదల బియ్యం మాటున రూ.కోట్ల వ్యాపారం చేస్తున్న మాఫియా ఆగడాలపై ప్రభుత్వం కన్నెర్ర జేసింది. ఇటీవల అధికార పార్టీలో ఈ రేషన్ బియ్యం అక్రమ రవాణా వ్యవహారం పెద్ద దుమారాన్నే రేపింది. దీంతో అసలు నెల్లూరు జిల్లాలో ఏం జరుగుతోందన్న దానిపై విచారణ మొదలుపెట్టింది. చాలా ఏళ్లుగా రేషన్ దందా కొనసాగుతున్నప్పటికీ ఇటీవల కొందరు వ్యక్తులు ఒక మాఫియాగా ఏర్పడి భారీగా వ్యాపారం చేయడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో విచ్చలవిడిగా రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఎక్కడికక్కడ సివిల్ సప్లయిస్ అధికారులతోపాటు ఇతర నిఘా విభాగాలను ఈ మాఫియా మేనేజ్ చేసుకుంటూ వస్తోంది. అయితే ఈ మాఫియా ఆగడాలు విపరీతమవడం, కొత్తవారిని ఈ దందాలోకి రానీయకుండా అడ్డుకోవడంతో లోలోపల జరుగుతున్న అక్రమాల బాగోతం కాస్తా రోడ్డు మీదకు వచ్చింది. నెల్లూరు శివారుప్రాంతం, కావలి ప్రాంతాల్లోని కొన్ని రైస్‌మిల్లుల కేంద్రంగా ఈ రేషన్ బియ్యం రీసైక్లింగ్ జరుగుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ అక్రమాలను అరికట్టడంతో సివిల్ సప్లయిస్ అధికారులు విఫలమయ్యారని గుర్తించిన ప్రభుత్వం.. ఇటీవల డీఎస్‌వోతోపాటు డీఎం సివిల్ సప్లయిస్ అధికారులను పిలిపించి పౌరసరఫరాల శాఖ మంత్రి, సెక్రటరీలు విజయవాడలో విచారించారు. ఆ నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా సివిల్ సప్లయిస్ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులపై బదిలీ వేటు వేసింది. పౌరసరఫరాల సంస్థ డీఎం కార్యాలయంలో కూడా కొందరిపై వేటు పడే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో రేషన్ మాఫియా డాన్లపైనా నిఘా వర్గాలు దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. నెల్లూరు, ఆత్మకూరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఈ మాఫియాలో కీలకంగా వ్యవహరిస్తుండగా, వారికి కొందరు అధికార పార్టీకి చెందిన నేతలు సహకారం అందిస్తున్నట్లు కూడా గుర్తించారు. ఈ మాఫియాపై కూడా కఠిన చర్యలకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

పేదల కోసం ప్రభుత్వం అందిస్తున్న బియ్యం బాగుంటున్నా వీటిని తినే విషయంలో అపోహలున్నాయి. ఇదే బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి మార్కెట్లోకి తీసుకొస్తుంటే వాటినే తింటుండడం గమనార్హం. రేషన్ దుకాణాల స్థాయిలోనే ప్రభుత్వం పంపిణీ చేసే బియ్యంపై ఎక్కువగా అపోహలు కల్పిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. బియ్యం బదులుగా కేజీకు రూ.10 చొప్పున డబ్బులు ఇచ్చేసి ఆ బియ్యా న్ని దొడ్డిదారిలో మాఫియా చేతికి అందజేస్తున్నారు. కొన్నిచోట్ల నేరుగా ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచే బియ్యం పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలున్నా యి. జిల్లాలో ప్రతి నెలా 10 వేల టన్నులకుపైగా బియ్యాన్ని పంపిణీ చేస్తుండగా అందులో రెండు వేల టన్నులకుపైగా బియ్యం మాఫియా చేతుల్లోకి వెళుతున్నట్లు సమాచారం. తద్వారా ప్రతి నెలా రూ.10 కోట్లకుపైగా వ్యాపారం చేసి ప్రజాధనాన్ని దిగమింగుతున్నారన్న ప్రచారముంది.

ప్రతి నెలా రూ.10 కోట్ల వ్యాపారం





రేషన్ అక్రమాలపై జూలైలో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలు

ముందే హెచ్చరించిన 'ఆంధ్రజ్యోతి'

జిల్లాలో జరుగుతున్న రేషన్ అక్రమాలపై ఈ ఏడాది జూలైలోనే 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించింది. రేషన్ ఎలా పక్కదారి పడుతోంది? దానిని రీసైక్లింగ్ చేసి ఏవిధంగా మళ్లీ మార్కెట్లోకి తీసుకొస్తున్నారు? తెరవెనుక ఉన్న మాఫియా.. వంటి వివరాలను వెలుగులోకి తీసుకొచ్చింది. అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడం, రేషన్ దుకాణాల్లో జరుగుతున్న వ్యవహారాలపై తనిఖీలు చేయకపోవడం వంటి విషయాలను కూడా ప్రస్తావించింది. అప్పట్లో జాయింట్ కలెక్టర్ 'ఆంధ్రజ్యోతి' కథనాలపై స్పందించి చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. కానీ నాడు అధికారులు పట్టించుకోలేదు. ఆ ఫలితం ఇప్పుడు అనుభవిస్తున్నారు.

పంటలు నష్టపోయిన రైతుల

వివరాలు నమోదు చేసుకోవాలి

- పూర్తి జాబితా ఆర్‌ఎస్‌కేల్లో ప్రచురిస్తాం
- డీఏవో సత్యవాణి

నెల్లూరు (వ్యవసాయం), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను, వరదల కారణంగా దెబ్బ తిన్న పంటలకు సంబంధించి వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి గణన చేస్తున్నారని జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) పి.సత్యవాణి ఒక ప్రకటనలో తెలిపారు. నష్టపరిహారం పొందాలంటే ప్రతిరైతు విధిగా పంట నమోదు చేసుకుని ఉండాలని, అదేవిధంగా రైతు ఆధార్‌కు బ్యాంకు ఎన్‌పీసీఐ లింకు చేసుకుని ఉండాలని పేర్కొన్నారు. 33శాతం కన్న ఎక్కువ పంట నష్టం జరిగిన రైతులు ఉంటే వెంటనే రైతు సేవా కేంద్రం ఇన్చార్జుల ను కలవాలని సూచించారు. వారి పరిశీలన అనంతరం ఏపీఏఐఎంఎస్ యాప్‌లో నమోదు చేస్తారని తెలిపారు. యాప్‌లో రిజెక్ట్ చేసిన రైతుల వివరాలను తిరిగి అప్‌లోడ్ చేసేందుకు అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. పూర్తి జాబితాను సామాజిక తనిఖీ కోసం రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శనకు ఉంచుతామని పేర్కొన్నారు.

జలం.. పుష్కలం

- భూగర్భాన 5.50 మీటర్లలోనే గంగమ్మ
- ప్రతి మండలంలోనూ అధిక వర్షపాతం
- నిండు కుండలను తలపిస్తున్న చెరువులు

నెల్లూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పుష్కలంగా కురిసిన వర్షాలతో జిల్లాలో భూగర్భ జలమట్టం భారీగా పెరుగుతోంది. ప్రస్తుతం 5.50 మీటర్లలోనే భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయి. గతేడాది ఇదే సమయంలో పోలిస్తే ఒక మీటరు మేర జలాలు పైకి రావడం విశేషం. కొన్ని మండలాల్లో గణనీయంగా జలమట్టం పెరగగా, మెట్ట ప్రాంతాల్లో కూడా పరిస్థితులు ఆశాజనకంగా ఉన్నాయి. దుత్తలూరు మండలంలో గతేడాది అక్టోబరులో 16.8 మీటర్ల లోతున భూగర్భ జలాలు ఉండగా, ఇప్పుడు 14.50 మీటర్లలోతులో ఉన్నాయి. కలువాయిలో 10.22 మీటర్ల నుంచి 7.65 మీటర్లకు, మనుబోలులో 21.18 మీటర్ల నుంచి 11.2 మీటర్లకు, సీతారామపురంలో 15.65 మీటర్ల నుంచి 11.85 మీటర్లకు జలమట్టం పెరిగింది. మెట్ట ప్రాంతాల్లోని పంటలు బోర్ల ఆధారంగా సాగు జరుగుతుండగా, కొన్ని సమయాల్లో ఆ బోర్లకు నీరు అందేది కాదు. అయితే ఇప్పుడు జలమట్టం పైకి పెరగడంతో మెట్ట ప్రాంతాలకు ఊరట కలగనుంది.



కలుజు పారుతున్న అల్లూరు చెరువు (ఫైల్)

● పుష్కలంగా వర్షాలు

ఈ ఏడాది జిల్లాలో వర్షాలు పుష్కలంగా కురిశాయి. సాధారణ వర్షపాతానికి మించి నమోదైంది. భూగర్భ జలమట్టం పెరగడానికి ఇదే ప్రధాన కారణం. సెప్టెంబరులో సాధారణ వర్షపాతం 104.8 మి.మీ కాగా కురిసింది 59.77 మి.మీ. అంటే ఆ నెలలో 40 శాతం మేర తక్కువ వర్షం కురిసింది. కానీ అక్టోబరు నెలకు వచ్చే సరికి సాధారణ వర్షపాతం 245.05 మి.మీ కాగా 307.73 మి.మీ కురిసింది. మొత్తంగా జూన్ నుంచి ఇప్పటి వరకూ చూస్తే.. 603.1 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 796.8 మి.మీ వర్షపాతం నమోదైంది. 32 శాతానికి పైగా అధిక వర్షం కురిసింది. జిల్లాలో ఏ ఒక్క మండలంలో కూడా లోటు వర్షపాతం నమోదు కాకపోవడం విశేషం.

● చెరువులకు జలకళ

గత నెలలో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని చెరువులన్నీ జలకళను సంతరించుకున్నాయి. రెండో పంట ముగిసే సమయానికి చెరువుల్లో కూడా నీటి మట్టం తగ్గిపోయింది. ఇప్పుడు కీలకమైన రబీ సీజన్ ప్రారంభంలోనే సోమశిల, కండలేరు ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేయాల్సిన అవసరం లేకుండా చెరువులు నిండు కుండలను తలపిస్తున్నాయి. మొత్తం సామర్థ్యంలో 90 మేర నీరు నిల్వ ఉంది. జిల్లాలో 1007 చెరువులు ఉండగా, వాటిలో సుమారు 600 చెరువులు పూర్తిగా నిండిపోయాయి. మిగిలిన చెరువుల్లో 75 శాతం మేర నీరు ఉన్నట్లు జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నీటితో రబీ సీజన్‌లో ఒక తడిని పూర్తి చేయవచ్చునని అంటున్నారు. అదే సమయంలో చెరువుల్లో నీటి నిల్వ ఫలితంగా ఆ పరిసరాల్లో భూగర్భ జలమట్టం కూడా పెరుగుతోంది.

'సోమశిల'కు భారీగా తగ్గిన ఇన్‌ఫ్లో

● డ్యాంలో 69.324 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. శనివారం 48,460 క్యూసెక్కులు వస్తుండగా ఆదివారానికి 27,626 క్యూసెక్కులుగా నమోదైనట్లు ఇంజనీర్లు తెలిపారు. దిగువకు 12,650, ఉత్తర కాలువకు 50, కండలేరుకు 560 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. డ్యాంలో 69.324 టీఎంసీలు నిల్వ ఉంది.

సంగం బ్యారేజీకి తగ్గిన ప్రవాహం

సంగం: సంగం బ్యారేజీకి వస్తున్న వరద నీటి ప్రవాహం ఆదివారం భారీగా తగ్గింది. సోమశిల నుంచి వస్తున్న నీటితోపాటు బీరాపేరు, బొగ్గేరు నుంచి సుమారు 49వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దీంతో బ్యారేజి వద్ద నీటిమట్టం 12.4 అడుగుల నుంచి 10.2 అడుగులకు తగ్గింది.

గండిపాళెంలో 23 అడుగుల నీరు

ఉదయగిరి : మండలంలోని గండిపాళెం జలాశయ నీటిమట్టం 23 అడుగులకు చేరిందని జలవనరుల శాఖ డీఈ కందుకూరి చంద్రమౌళి తెలిపారు. జలాశయ సామర్థ్యం 35 అడుగులు కాగా ప్రస్తుతం 23 అడుగులకు నీరు చేరినట్లు తెలిపారు. జలాశయం పైతట్టు ప్రాంతంలో పిల్లాపేరు, దున్నపోతుల వాగులతోపాటు పలు చెరువులు అలుగులు పారుతుండడంతో జలాశయంలోకి 276 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు తెలిపారు.



వేదగిరీశుడికి వైభవంగా పవిత్రోత్సవాలు

నెల్లూరురూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వేదగిరి క్షేత్రంలో పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం విష్వక్సేన పూజతో మొదలైన పవిత్ర పూజలు అగ్ని ప్రణయనం, సర్వ దైవత్యహోమం, జప్యము, నీరాజనము అనంతరం స్వామి, అమ్మవార్లకు వేద పండితుల మంత్రోశ్చరణల నడుమ పవిత్రాల సమర్పణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. అనంతరం లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మిలకు గిరి ప్రదక్షణ నిర్వహించారు. కుంభారాధన, ఉక్తహోమం, పారమాత్మిక హోమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఆలయ చైర్మన్ ఇందుపూరు అచ్యుత రెడ్డి దంపతులు, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఈవో గోపి, మాజీ చైర్మన్లు వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, భాస్కరాచార్యులు, పాల్గొన్నారు. కాగా పవిత్రోత్సవాలు సోమవారం ముగియనున్నాయి.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	137
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 575

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)
ఒక గ్రాము ధర రూ.11613
వెండి కిలో ధర రూ. 152700
వెండి ఒక గ్రాము రూ.158.70

12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించాలి : ఎస్టీయూ

కందుకూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తక్షణం 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమిం చాలని, ఐఆర్ ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు సీహెచ్ ఆదినారాయణ, జోనల్ కన్వీనర్ గద్దగుంట వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో కందుకూరు జోనల్ సమావేశం ఆదివారం జరిగింది. లింగ సముద్రం మండలానికి ఎస్టీయూ అధ్యక్షుడిగా రావి మల్లికార్జునను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నాయకులు పొతకమూరి కృష్ణయ్య, చేతల వెంకటేశ్వర్లు, గళ్లా వెంకటరావు, పి. జాన్సన్, కందుల శ్రీను, తన్నీరు తిరుపాలు, ఎన్వీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

వృద్ధ దంపతుల కుటుంబానికి ఎమ్మెల్యే ఇంటూరి పరామర్శ

కందుకూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆత్మహత్య చేసుకున్న వృద్ధ దంపతులు పువ్వాడి పున్నయ్య, రోశమ్మ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం పరామర్శించారు. వారి కుమారుడు, 3వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పువ్వాడి కోటయ్యను, ఇతర కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో దామా మల్లేశ్వరరావు, ఎన్వీ రమణయ్య, బత్తిన మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు సంక్షేమ ఫలాలు అందించాలి

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు

కావలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా చేయూతను అందించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్ర సాయి పేర్కొన్నారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదురుగా యూనియన్ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. పారిశుధ్య కార్మికులకు నివాస స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయకుండా ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జిలానీ బాష, సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు మాలకొండయ్య, సీపీఐ సహాయ కార్యదర్శి ఎన్ రమణయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గసభ్యులు మల్లి అంకయ్య, కావలి అధ్యక్ష, కార్యదర్శులు ఎండ్లూరి ఆదినారాయణ, తన్నీరు వెంకటేష్, నేతలు పీ సుబ్బరాయుడు, ఎం వెంకటేశ్వర్లు, దమ్ము దర్గాబాబు, చేవూరు కొండయ్య, సీపీఎం నాయకుడు పెంచలయ్య, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



కార్మిక యూనియన్ కార్యాలయ ప్రారంభోత్సవంలో నాయకులు

ఉత్సాహంగా క్రీడాపోటీలు

కావలి (టౌన్) నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జేబీ డిగ్రీ కళాశాల డీఆర్ క్రీడా ప్రాంగణంలో విశ్వోదయ డీఆర్ బాలల దినోత్సవ క్రీడాపోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్ రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డిలు క్రీడాకారులను పరిచయం చేసుకుని, పోటీలు ప్రారంభించారు. వినయ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల దశనుంచి క్రీడాకారులను ప్రోత్సాహమందించాలన్న ధృక్పథంతో ప్రతి ఏటా క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. నవంబర్ 14న బాలల దినోత్సవం జరుగుతుందని జేబీ పీడీ ప్రసాద్ రెడ్డి తెలిపారు. విశ్రాంత ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలో తలపడుతున్న విశ్వోదయ, జెడ్పీ బాలికల పాఠశాల జట్లు

విజేతలు వీరే...

బాలుర కబడ్డీలో విన్నర్స్ జెడ్పీహెచ్ఎస్ కావలి, రన్నర్స్‌గా ఆర్ఎస్ఆర్ గౌరవరం, వాలీబాల్‌లో విన్నర్స్‌గా వీబీహెచ్ఎస్, రన్నర్స్‌గా ఆర్ఎస్ఆర్ గౌరవరం, ఫుట్‌బాల్‌లో విన్నర్స్‌గా నారా యణ ఆర్ఎమ్‌సీ, రన్నర్స్‌గా వీబీహెచ్ఎస్ కావలి, బాల్ బ్యాట్మింటన్‌లో విన్నర్స్‌గా జెడ్పీహెచ్ఎస్ ఆర్‌సీపాలెం, రన్నర్స్‌గా వీబీహెచ్ ఎస్ కావలి, టేబుల్ టెన్నిస్‌లో విన్నర్స్‌గా శ్రీవేదం గ్లోబల్ కొత్తపల్లి, రన్నర్స్ గా వీబీహెచ్ఎస్ కావలి, కోకోలో విన్నర్‌గా జెడ్పీహెచ్ఎస్ కొత్తపల్లి, రన్నర్స్ గా జెడ్పీహెచ్ఎస్ ఆర్సీపాలెం జట్లు నిలిచాయి. బాలికల కబడ్డీ పోటీల్లో వీజీహెచ్ఎస్ విన్నర్స్‌గా, కెజీబీవీ రన్నర్స్‌గా, త్రోబాల్‌లో వీజీహెచ్ఎస్ విన్నర్స్‌గా, కావలి జెడ్పీ రన్నర్స్‌గా, ఖోఖోలో వీజీహెచ్ఎస్ విన్నర్స్‌గా, కొత్తపల్లి జెడ్పీ రన్నర్స్‌గా, వాలీబాల్‌లో విన్నర్స్‌గా జెడ్పీ, కావలి రన్నర్స్‌గా కావలి వీజీహెచ్ఎస్ జట్లు నిలిచాయి. టెన్నికాయిట్‌లో విన్నర్స్‌గా కేజీబీవీ, ముసునూరు రన్నర్స్‌గా కావలి వీజీహెచ్ఎస్, బ్యాడ్మింటన్‌లో విన్నర్స్‌గా కావలి వీజీహెచ్ఎస్, రన్నర్స్‌గా భాష్యం జట్లు నిలవగా బాలికల ఓవరాల్ ఛాంపియన్‌గా వీజీహెచ్ఎస్ కావలి జట్టు నిలిచింది.

సనాతన సంస్కృతికి బ్రాహ్మణులు మూల స్తంభాలు : దగుమాటి

కావలి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణులు భారతీయ సనాతన సంస్కృతికి మూల స్తంభాలని, వారు త్రికరణశుద్ధిగా నిర్వహించే హోమాలు సమాజానికి సకల శుభాలను కలిగిస్తాయని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని ముసునూరు అయ్యప్ప స్వామి ఆలయంలో బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్తీకవన సమారాధన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, స్వామిని దర్శించుకున్నారు. స్వామి కృపా కటాక్షలతో ప్రజలందరికీ శాంతి, ఆనందం కలగాలని ఆకాంక్షించారు. బ్రాహ్మణులు పాటించే పవిత్ర సంప్రదాయాలు తనకు ఎంతో ఇష్టమన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవాసంఘం నాయకులు పాల్గొన్నారు.



స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

ఎమ్మెల్యేని కలిసిన ఏఈ కిరణ్

మొంథా తుపాన్ ముందస్తు చర్యలు చేపట్టి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అమరావతిలో మొంథా తుఫాన్ సైక్లోన్ ఫైటర్ అవార్డు అందుకున్న కావలి జల వనరులశాఖ ఏఈ జంపాని కిరణ్ ఆదివారం మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏఈని అభినందించారు.

గిరిజనుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కావలి రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని ఆనెమడుగు సాగునీటి సంఘం అధ్యక్షుడు బొమ్మిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. కావలి మండలం ఆనెమడుగులో శ్రీనివాసులు రెడ్డి, సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే సూచనల మేరకు గిరిజనులకు దుప్పట్ల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, ఆనెమడుగు పంచాయతీ అధికారి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.



గిరిజనులకు దుప్పట్లు అందజేస్తున్న స్థానిక నాయకులు

కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపాలి

● అయ్యప్ప భక్తుల ర్యాలీ

ఉలవపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలిపి కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిలుపుకోవాలని కోరుతూ కరేడుకు చెందిన బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు, అయ్యప్ప మాలదారులు ఆదివారం ప్రదర్శన చేశారు. ప్రస్తుత నెల్లూరు జిల్లాకు చెందిన కొందరు ప్రజాప్రతినిధులు కందుకూరు నియోజకవర్గంలోనే ఉంచాలనే ప్రయత్నాలు చేస్తున్నారని, ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు మార్కాపురంను కొత్త జిల్లాగాను, అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో కలుపుతామని మాట ఇచ్చారని గుర్తుచేశారు.

ప్రకాశంలోనే చేర్చాలి

● మాజీ ఎమ్మెల్యే దివి శివరాం

కందుకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో చేర్చి ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్‌లు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, నియోజకవర్గ అభివృద్ధి మండలి ప్రతినిధులు పాలేటి కోటేశ్వరరావు, బూసి సురేష్‌బాబు, నేతి మహేశ్వరరావు, పొడపాటి శ్రీను తదితరులు ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రమైన ఒంగోలుకు



ర్యాలీ నిర్వహిస్తున్న అయ్యప్ప మాలధారులు

కేవలం 43 కి.మీ దూరంలో ఉన్న కందుకూరును తీసుకెళ్లి 120 కి.మీ దూరంలో ఉన్న నెల్లూరులో కలపటం అన్యాయమని నిరసిస్తూ పార్టీలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలు ఐక్యంగా 55 రోజులు దీక్షలు చేయటంతో పాటు సంపూర్ణ బంద్ నిర్వహించారని వారు గుర్తుచేశారు. కందుకూరులో ఉన్న అనేక డివిజన్ కార్యాలయాలు కూడా సింగరాయకొండ, కావలి, ఒంగోలుకు తరలిపోయి తీరని నష్టం జరిగిందని విమర్శించారు. ఈనేపథ్యంలో కందుకూరును తిరిగి ప్రకాశం జిల్లాలో కలపటంతో పాటు డివిజన్ కేంద్రంగా పూర్వవైభవం వచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్‌చేశారు.

ఉత్తమ శిక్షణతోనే ఉన్నత స్థాయి

బిట్రగుంట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ శిక్షణతో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఇంటర్నేషనల్ మాస్టర్ ఈ రవిగన్ నిరూపించారని డాక్టర్ కే తిరుపతమ్మ పేర్కొన్నారు. బోగోలు మండలం బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో ఇటీవల విజయనగరం జిల్లాలో జరిగిన 42వ క్యాడెట్ స్టేట్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో బిట్రగుంట తైక్వాండో విద్యార్థులు 8 మంది పాల్గొన్నారు. ముగ్గురు బ్రాంజ్, నలుగురు సిల్వర్ మెడల్స్ సాధించగా, బచ్చుసాయి 80 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించాడు. విజేతలకు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీ బర్నాడ్, గౌరవాధ్యక్షుడు పీ స్వర్ణన్‌రాజ్, మాజీ గౌరవాధ్యక్షుడు ఎన్ఎస్ యాదవ్, రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి గోవింద రాజులు, ప్రముఖ వ్యాపారి కే జనార్దన్ రెడ్డి, విద్యార్థులు, తల్లి తండ్రులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బోగోలులో వైభవంగా 'ఆల్ సోల్స్' ఫెస్టివల్

బిట్రగుంట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండల కేంద్రంలో క్రైస్తవ సమాధుల తోటలో ఆదివారం సాయంత్రం ఆల్‌సోల్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యుల సమాధులను అందంగా అలంకరించుకుని క్రైస్తవ సంఘ కాపరులచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బ్రిటీష్ కాలంలో ఏర్పాటు చేసిన క్రైస్తవ సమాధుల తోట కావడంతో ఆంగ్లోఇండియన్ల సమాధులను దర్శించుకునేందుకు చెన్నై, తెలంగాణ ప్రాంతవాసులు వచ్చారు. సమాధుల వద్ద క్యాండిల్స్ వెలిగించి ప్రార్థనలు చేశారు. పేదలకు భోజనం, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు జే ఐజెక్, శ్యాంసన్‌బాబు, ఎబినేజర్, పౌలు, జార్జీ, దేవదానం, సామ్యేల్, యేసు రత్నం, అనిల్ జ్యోషి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



పూలతో అలంకరించిన పెద్దల సమాధులు

కేజ్ వీల్స్‌తో రహదారులు ధ్వంసం

ఉదయగిరి రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేజ్ వీల్స్‌తో రహదారులు ధ్వంసం అవుతున్నా పట్టించుకునే నాథుడే లేడని వాహనదారులు విమర్శిస్తున్నారు. రైతులు పొలాలను సాగు చేసుకొనే క్రమంలో ముందస్తుగా కేజ్ వీల్స్‌తో దుక్కి చేస్తుంటారు. ఈ నేపథ్యంలో కొంతమంది ట్రాక్టర్ల యజమానులు ఇష్టాను సారంగా వ్యవహరిస్తూ నివాసాల వద్దే వాటిని అమర్చుకొని ప్రధాన రహదారుల మీద పొలాలకు వెళ్తుండడం గమనార్హం. దీంతో ఇనుప చక్రాల బరువుకు తారురోడ్లు దారి పొడవునా పెచ్చులూడి గుంతలు పడడంతో పాటు ఛిద్రం అవుతున్నాయి. దీంతో ప్రమాదాలకు గురికావల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గండిపాళెం, గుడినరవ, సున్నంవారిచింతల, మాసాయిపేట గ్రామాలతో పాటు వరికుంటపాడు మండలం జీ.కొండారెడ్డిపల్లి, ఇస్కపల్లి, యర్రంరెడ్డిపల్లి, తిమ్మారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ఇలాంటి పరిస్థితి దాపురించడంతో పగలు ఎలాగోలా ప్రయాణాలు సాగించినప్పటికీ రాత్రివేళ, వర్షాలు కురిసిన సమయంలో వాహనదారుల బాధలు వర్ణణాతీతంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



గండిపాళెంలో అధ్వానంగా మారిన రహదారి

ఆదమరిస్తే అంతే సంగతులు ..


వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు బోయమడగల బస్టాండ్ సెంటర్ సమీపంలోని మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఆ రహదారి సమీపంలోనే నివాసాలు ఉండడంతో పాటు ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్ల పుణ్యమాని ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలకు గురికావాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆ మలుపు వద్ద ఒకరు మృత్యువాత పడడంతో పాటు పలువురు గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. ఆ మార్గంలో ప్రతినిత్యం ప్రకాశం జిల్లా పామూరుకు వెళ్లే ఆర్టీసీ బస్సులతో ఎసమయంలో ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని బెంబేలెత్తిపోతున్నారు. కనీసం స్పీడ్‌బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ప్రమాదకరంగా మారిన మలుపు

వర్షాలకు ఒరిగిన విద్యుత్ స్తంభం

ఉదయగిరి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో స్టేట్‌పేట ప్రాంతంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఓ విద్యుత్ స్తంభం ఒరిగి కూలేదశలో ఉంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా స్తంభం ఒరిగిపోయిందని, ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్తంభాన్ని సరిచేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



ఇంకుడు గుంత నిర్మించండి సారూ..

అనంతసాగరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన కాలనీలో ఏర్పాటు చేసిన చేతిపంపు వద్ద ఇంకుడు గుంత లేక వ్యర్థనీరుతో బురదగా మారి దుర్గంధం వెదజల్లుతోందని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇంకుడు గుంత నిర్మించి సమస్య పరిష్కరించాలని సంబంధిత అధికారులను కాలనీవాసులు కోరుతున్నారు.

చేనేతలకు నష్ట పరిహారం అందచేయాలి

● చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ

సంగం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో నష్టపోయిన జిల్లాలోని చేనేత కార్మికులకు నష్టపరిహారంతో పాటు పనులు కోల్పోయిన ప్రతి కుటుంబానికి రూ. 20 వేల ఆర్థికసాయం అందచేయాలని జిల్లా చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు మండల కేంద్రంలోని సాయినగర్, రాళ్లచెలిక, కొత్తూరు, శ్రీనివాసపురం, తిరుమనతిప్ప చేనేతలు నివసిస్తున్న కాలనీల్లో పర్యటించారు. మగ్గం గుంతల్లోకి వచ్చిన నీటిని, దెబ్బతిన్న పడుగు, నూలు, చీరలను పరిశీలించి చేనేతలతో మాట్లాడారు. అనంతరం నేతన్నల దుస్థితిని ఫోన్‌లో ఏడీకి వివరించారు. ఈసందర్భంగా చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ మాట్లాడుతూ భారీ వర్షాలకు చేనేతల మగ్గం గుంతల్లోకి నీరు రావడంతో 10 రోజులుగా పనులు లేవని, మరో 15 రోజులైనా గుంతల్లో ఊట తగ్గే పరిస్థితి లేదన్నారు. నష్టపరిహారంతోపాటు పనులు కోల్పోయిన ప్రతి కుటుంబానికి రూ. 20 వేల ఆర్థిక సాయం అందచేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతన్నలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఆమేరకు త్వరలో చేనేత జౌళి శాఖ మంత్రిని కలవనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సోమా గోపాల్, ఉపాధ్యక్షుడు జానపాటి రామసుబ్బయ్య, జిల్లా కార్యదర్శి బండి శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యుడు బోడిచర్ల రవి, స్థానిక చేనేత కార్మికులు పాల్గొన్నారు.



మగ్గం గుంటను పరిశీలిస్తున్న చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు

ఈ-పంట నమోదుకు గడువు పెంపు

ఉదయగిరి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈ-పంట నమోదుకు ఈనెల 8వతేదీ వరకు గడువు పెంచినట్లు ఉదయగిరి వ్యవ సాయ సహాయ సంచాలకుడు పొర్లపల్లి చెన్నారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు. ఈ-పంట నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ రాయితీ పథకాలు వర్తిస్తాయన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దివంగత రాష్ట్ర మంత్రి గౌతమ్‌రెడ్డికి ఘన నివాళి

ఆత్మకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దివంగత రాష్ట్ర మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని ఆదివారం మున్సిపల్ బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, వైసీపీ పట్టణ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

● సంగం : దివంగత మాజీ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి జయంతిని మండలంలో వైసీపీ శ్రేణులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బ్యారేజి వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి అభిమానులకు పంచారు. ఈ కార్యక్రమంలో వైసీపీ శ్రేణులు పాల్గొన్నాయి.

రైతులకు యూరియా పంపిణీ

ఉలవపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు ఇబ్బంది పడకుండా కూటమి ప్రభుత్వం యూరియా సరఫరా చేసిందని మండల వ్యవసాయ అధికారి విజయ్ కుమార్ ఆదివారం తెలిపారు. కరేడులోని ఆర్ఎస్‌కే-1 పరిధిలోని రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల పరిధిలో మొత్తం 140 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్లు, మరో ఆర్ఎస్‌కేకు 20 మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించిన సబ్సిడీ మేరకు రైతులకు 45 కిలోల యూరియా బస్తా రూ.267కే అందిస్తామన్నారు. అవసరమైన రైతులు రైతుసేవా కేంద్రాలలో ఆన్‌లైన్ పేరు నమోదు చేయించుకొని యూరియా పొందవచ్చన్నారు.



కరేడు ఆర్ఎస్‌కే నుంచి యూరియా కొనుగోలు చేసిన రైతులు

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం గ్రామానికి సోమవారం ప్రముఖ రాజకీయ నాయకులు వస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సౌజన్యంతో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీపీఆర్ నేత్ర ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారం భించడం జరుగుతుందన్నారు. కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలు అందజేస్తారన్నారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఉదయగిరి, కోవూరు ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు.

నవవధువుకు ఆర్థిక సాయం

వింజమూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మరాజుచెరువు గ్రామం ఎస్సీ కాలనీలో ఆత్మకూరి కొండయ్య, లక్ష్మమ్మ దంపతుల కుమార్తె మాధవి వివాహం సందర్భంగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కాకర్ల ట్రస్ట్ తరపున పెళ్లి కానుకగా రూ.10వేలు స్థానిక నాయకులు ఆదివారం అందించారు. కార్యక్రమంలో వింజమూరు సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉలవపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): భీమవరంలోని 33కేవీ ఫీడర్ మరమ్మతులు చేపడుతున్న క్రమంలో మన్నేటికోట 133 కేవీ సబ్‌స్టేషన్ నుంచి మండలంలోని అన్ని సబ్‌స్టేషన్‌లకు సోమవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని మండల విద్యుత్‌శాఖ ఏఈ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.


శివ కుటుంబార్చన కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శివభక్త మండలి సభ్యులు

కలువాయి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజరాజేశ్వరి సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో శివభక్త మండలి ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన నిర్వహించతలపెట్టిన శివ కుటుంబార్చన కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. స్వామివారికి అభిషేకం, గణపతి పూజ, 5 నదుల గంగా జలాలతో సామూహిక రుద్రాభిషేకం, విబూది, చందనం, మారేడు దళాలు, పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సతీసమేత వీరబ్రహ్మేంద్రస్వామి

ఆత్మకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని హనుమాన్ జంక్షన్ వద్ద ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం జయంతి వేడుకలను నిర్వహించారు. స్వామివారికి ఉదయం సుప్రభాత సేవ, మంగళతోరణం, అభిషేకం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ గావించారు.

లలితా రుద్ర మహాయజ్ఞం

సంగం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమనకొండపైన ఉన్న రాజరాజేశ్వరిదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి జ్ఞానపీఠంలో లలితా రుద్ర మహాయజ్ఞం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో క్షీర, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి పూజలు నిర్వహించారు.